News Daily
ఎడిటర్ :
B. ఉపేందర్
cknews7484@gmail.com
Visit in :
www.cknewstv.in

# CK NEWS
చంద్రకాంత్
తెలుగు దినపత్రిక

Website
cknewstv.in

సంపుటి : 03 | సంచిక :70 | ఖమ్మం | ఆదివారం, ఏప్రిల్ 27, 2025 | CK NEWS | పేజీలు : 08

Hyderabad, Karimnagar, Khammam, Nalgonda, Nizamabad, Warangal, Mahabubnagar. Rangareddy, Medak, Adilabad

# గులాబీ రజతోత్సవ సంబురం

## ఎల్కతుర్తిలో నేడు బహిరంగ సభ
## కేసీఆర్ సహా హాజరుకానున్న పార్టీ నేతలు
## పునరుత్తేజమే లక్ష్యంగా దిశానిర్దేశం చేయనున్న భారాస అధినేత

తెలంగాణ రాష్ట్ర సాధనే లక్ష్యంగా 2001లో ఆవిర్భవించి.. 13 ఏళ్లు ఉద్యమ పార్టీగా.. తొమ్మిదిన్నరేళ్లు అధికార పార్టీగా.. ప్రస్తుతం ప్రతిపక్ష పార్టీగా భిన్నపాత్రలు పోషిస్తున్న భారత రాష్ట్ర సమితి (భారాస) రజతోత్సవ సంబరానికి సిద్ధమైంది. తెలంగాణ రాష్ట్ర సమితి (తెరాస)గా మొగ్గ తొడిగిన పార్టీ.. 2014లో ప్రత్యేక రాష్ట్రం ఏర్పడగానే తొలి ప్రభుత్వంగా అధికారంలోకి వచ్చింది. ఎనిమిదేళ్ల తర్వాత జాతీయస్థాయిలో విస్తరించాలనే లక్ష్యంతో 2022లో 'భారాస'గా రూపాంతరం చెంది.. ఇప్పుడు రజతోత్సవ సభ ద్వారా తిరిగి సత్తా చాటేందుకు సన్నద్ధమైంది. పార్టీ అధినేత కేసీఆర్ ఆదివారం సాయంత్రం హనుమకొండ జిల్లా ఎల్కతుర్తిలో జరిగే భారీ బహిరంగసభలో ప్రసంగించడం ద్వారా కార్యకర్తలను తిరిగి కార్యోన్ముఖులను చేయనున్నారు. గులాబీ దళం ఈ సభను ప్రతిష్ఠాత్మకంగా తీసుకొని విజయవంతం చేసే దిశగా పనిచేస్తోంది. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత వరుసగా రెండు దఫాలు విజయాలతో అధికారం చేపట్టి.. మూడోసారి ఓటమి చెందిన భారాస.. మొన్నటి లోక్‌సభ ఎన్నికల్లో ఒక్క సీటు కూడా గెలవలేకపోయింది. ప్రతిపక్ష పాత్రలో భాగంగా.. ముఖ్యనాయకులు ప్రభుత్వంపై పోరాటంలో చురుగ్గా పాల్గొంటూ ప్రజలకు దగ్గరయ్యేందుకు నిరంతరం ప్రయత్నిస్తున్నారు. రజతోత్సవ బహిరంగసభ భారాస మళ్లీ తన వైభవాన్ని పొందడానికి ఓ మైలురాయి కాగలదని పార్టీ నేతలు ఆశిస్తున్నారు.




**ఆది నుంచీ వ్యూహాత్మకంగానే..**

తెరాస రాజకీయ ప్రస్థానంలో కేసీఆర్ ప్రతి అడుగూ వ్యూహాత్మకంగానే సాగింది.

వివరాలు 2లో..





## కొత్త నాయకత్వం నిర్మితమవ్వాలి

- ప్రపంచాన్ని ప్రేమ దృక్కోణంలో చూసేలా రాజకీయాలు మారాలి
- ప్రతిపక్షాలకు దారులు మూసేయడంతోనే భారత్ జోడో యాత్ర చేపట్టా
- 4 వేల కి.మీ. పాదయాత్రలో ఎన్నో విషయాలు నేర్చుకున్నా
- భారత్ సమ్మిట్‌లో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ

ప్రపంచవ్యాప్తంగా రాజకీయాల్లో ప్రాథమికంగా మార్పు వచ్చిందని.. దశాబ్దం క్రితం వర్తించిన నియమాలు ఇప్పుడు ఏమాత్రం పనిచేయడం లేదని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ పేర్కొన్నారు. డబ్బు, మీడియా గుత్తాధిపత్యం పెరిగిందని.. ఇది మొత్తం రాజకీయాల స్వభావాన్నే మార్చేసిందన్నారు. ప్రపంచాన్ని ప్రేమ, ఆప్యాయత, సానుభూతి అనే దృక్కోణంలో చూసేలా రాజకీయాలు మారాల్సిన అవసరముందని పేర్కొన్నారు. రాజకీయాల్లో కొత్త నాయకత్వం నిర్మితం కావాల్సిన అవసరముందన్నారు. విపక్షాలు చెప్పేది వినకుండా వాటిని అణచివేసే ధోరణి పెరిగిందని, ఈ కారణంగానే తాను 4 వేల కి.మీ. మేర

వివరాలు 2లో..

## కర్రెగుట్టల్లో భారీ ఎన్‌కౌంటర్.. 38 మంది నక్సలైట్లు మృతి!



తెలంగాణ-ఛత్తీస్‌గఢ్ సరిహద్దులోని బీజాపూర్ జిల్లా ధర్మ తాళ్లగుడెం పరిధిలోని కర్రెగుట్టల్లో భారీ ఎన్‌కౌంటర్ జరిగింది. ఇందులో 38 మంది మావోయిస్టులు మృతిచెందినట్టు సమాచారం. గతవారం రోజులుగా కర్రెగుట్టలే లక్ష్యంగా భద్రతా దళాలు ఆపరేషన్ కగార్ చేపట్టిన విషయం తెలిసిందే. సుమారు 5,500 మందితో

వివరాలు 2లో..

## ఏం జరిగినా ఎదుర్కొంటాం: పహల్గాం ఉగ్రదాడిపై నోరు విప్పిన పాక్ ప్రధాని




జమ్మూకశ్మీర్‌లోని పహల్గాంలో పర్యాటకులపై ఉగ్రదాడి నేపథ్యంలో భారత్, పాకిస్థాన్‌ల మధ్య ఉద్రిక్తతలు తీవ్రమయ్యాయి. ఈ క్రమంలోనే న్యూఢిల్లీ తీసుకున్న పలు నిర్ణయాలపై పొరుగుదేశంలోని పలువురు మంత్రులు అక్కసు వెళ్లగక్కారు. ఈ పరిణామాలపై పాక్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ తాజాగా మౌనం వీడారు. పహల్గాం దాడి పై తటస్థ దర్యాప్తునకు తాము సిద్ధమేనని ప్రకటించారు. ఎలాంటి ముప్పునైనా ఎదుర్కొంటా మంటూ వ్యాఖ్యానించారు.ఖైబర్

వివరాలు 2లో..

## స్టూడెంట్ వీసాపై వెళ్లి.. ఉగ్రవాదిగా మారి

- జమ్ము నుంచి పాకిస్తాన్ వెళ్లిన ఆదిల్ అహ్మద్ థోకర్
- పహెల్గాం ఉగ్రదాడిలో కీలక నిందితుడు
- స్వస్థలం అనంత్ నాగ్ జిల్లా గుర్రె గ్రామం
- 2024లో పూంచ్ సెక్టార్ నుంచి దొంగ చాటున టెర్రరిస్టుల టీమ్ తో రీ ఎంట్రీ




పహెల్గాం ఉగ్రదా డిలో 26 మంది మృతి చెందిన సంగతి తెలిసిందే. ఈ ఉగ్రదాడి నిందితుల్లో ఒకరైన ఆదిల్ అహ్మద్ థోకర్ 2018లో పాకిస్తాన్ కు స్టూడెంట్ వీసాపై వెళ్లి ఆరు సంవత్సరాల తర్వాత ముగ్గురు నుండి నలుగురు ఉగ్రవాదులతో తిరిగి వచ్చాడని నిఘా వర్గాలు తెలిపాయి. జమ్మూ కాశ్మీర్‌లోని అనంత్‌నాగ్ జిల్లాలోని బిజ్‌బెహారాలోని గుర్రే గ్రామానికి చెందిన ఆదిల్ అహ్మద్ థోకర్, పహల్గామ్‌లోని బైసరన్‌లో జరిగిన ఉగ్రవాద దాడికి వ్యూహం పన్నిన వారిలో ఒకడు. నిఘా అధికారుల ప్రకారం, థోకర్ భారత్

వివరాలు 2లో..

## పోప్ ఫ్రాన్సిస్‌కు అశ్రునివాళి.. అంత్యక్రియలకు హాజరైన భారత రాష్ట్రపతి ముర్ము, ప్రపంచ నేతలు

- పోప్ ఫ్రాన్సిస్ అంత్యక్రియలు వాటికన్‌లోని సెయింట్ పీటర్స్ స్క్వేర్‌లో ఘనంగా నిర్వహణ
- 2.5 లక్షల మందికి పైగా సామాన్య ప్రజలు, 100కు పైగా దేశాల ప్రతినిధులు హాజరు
- భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము నేతృత్వంలో భారత బృందం నివాళి
- ప్రపంచ శాంతి కోసం పోప్ నిరంతరం పాటుపడ్డారన్న కార్డినల్ రే
- పోప్ కోరిక మేరకు వాటికన్ వెలుపల రోమ్‌లోని బేసిలికాలో ఖననం పూర్తి



వివరాలు 2లో..

## పరిహారం సొమ్ము ఆదా చేయాలనే పోలవరం ఎత్తు తగ్గింపు



పోలవరం ప్రాజెక్టును 45 మీటర్ల ఎత్తుతో నిర్మిస్తే 85 వేల కుటుంబాలకు పైగా పునరావాస ప్యాకేజీ ఇవ్వాల్సి ఉంటుందని, అదే 41 మీటర్లయితే 20 వేల కుటుంబాలకు ఇస్తే సరిపోతుందన్న ఉద్దేశంతోనే ప్రభుత్వాలు ప్రాజెక్టు ఎత్తును తగ్గిస్తున్నాయని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు షర్మిల విమర్శించారు. నిర్వాసితులకు ఇవ్వాల్సిన రూ.33 వేల కోట్ల పరిహారాన్ని మిగుల్చుకోవడానికి ఎత్తుగడలు వేస్తున్నాయని ఆరోపించారు. విజయవాడలోని పార్టీ రాష్ట్ర కార్యాలయంలో శనివారం ఆమె పోలవరం నిర్వాసితులతో సమావేశమయ్యారు. అనంతరం

వివరాలు 2లో..

## పాక్ వెన్నులో వణుకు పుట్టేలా చర్యలు..

- పహల్గామ్ ఘటన ఉగ్రవాదుల రాక్షసత్వానికి పరాకాష్ఠ అన్న మంత్రి
- ఈ ఘటనకు ప్రతీకారంగా పాక్ వెన్నులో వణుకు పుట్టేలా చర్యలుంటాయని వ్యాఖ్య
- ఈ క్లిష్ట సమయంలో ప్రధాని మోదీ తీసుకునే కఠిన నిర్ణయాలకు అంతా అండగా ఉండాలని పిలుపు



పహల్గామ్ ఘటనకు ప్రతీకారంగా దాయాది పాకిస్థాన్ వెన్నులో వణుకు పుట్టేలా భారత్ చర్యలు ఉంటాయని కేంద్రమంత్రి బండి సంజయ్ తెలిపారు. ఎంసీహెచ్‌ఆర్‌డీలో నిర్వహించిన రోజ్‌గార్ మేళాలో ఆయన పాల్గొన్నారు. ఉద్యోగాలకు ఎంపికైన వంద మందికి నియామక పత్రాలు అందజేశారు. ఆ తర్వాత మంత్రి మాట్లాడుతూ... పహల్గామ్ పాశవిక దాడి ఉగ్రవాదుల రాక్షసత్వానికి పరాకాష్ఠ అని అన్నారు. ఉగ్రవాదాన్ని ప్రోత్సహిస్తున్నట్లు పాక్ రక్షణమంత్రి అంగీకరించారని గుర్తుచేశారు. కానీ, తుపాకీ పట్టినోడు ఆ తుపాకీకే బలవుతాడని అన్నారు. ఈ విపత్కర పరిస్థితుల్లో ప్రధాని నరేంద్ర మోదీ తీసుకునే కఠిన నిర్ణయాలకు అందరూ అండగా నిలవాలని బండి సంజయ్ పిలుపునిచ్చారు.

వివరాలు 2లో..

## ఏపీ లిక్కర్ స్కామ్ లోకల్ కాదు... ఇంటర్నేషనల్


- ఏపీ లిక్కర్ స్కామ్ రూ. 3200 కోట్లు కాదు.. రూ.10 వేల కోట్లకు పైనే అన్న ఎమ్మెల్యే
- అధికారిక సేల్ తగ్గించి అక్రమంగా అమ్మేసి వేల కోట్లు దోచేశారని ఆరోపణ
- అమరావతిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో మీడియాతో సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి

వివరాలు 2లో..




## సీఎం రేవంత్ రెడ్డి కూడా అలాగే ఉన్నారని తెలుసుకోండి

- రాహుల్ గాంధీ 'ఎలక్షన్ గాంధీ' మాత్రమేనని విమర్శ
- తెలంగాణ సమస్యలపై రాహుల్ మౌనం ఎందుకని నిలదీత
- కాంగ్రెస్ ఇచ్చిన 6 గ్యారంటీలు, హామీలు అమలు కాలేదని ఆరోపణ
- సోనియా, రాహుల్, రేవంత్ బెయిల్‌పై ఉన్నారని వ్యాఖ్య



వివరాలు 2లో..

## ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు మరో పథకం ప్రారంభించాం



- మత్స్యకారుల సేవలో పథకం ప్రారంభించిన కూటమి ప్రభుత్వం
- శ్రీకాకుళం జిల్లా బుడగట్లపాలెం గ్రామంలో చంద్రబాబు పర్యటన
- మత్స్యకారులతో మాట్లాడి వారి సమస్యలు తెలుసుకున్న వైనం

వివరాలు 2లో..

# గులాబీ రజతోత్సవ సంబురం

- మొదటి పేజి తరువాయి
2001లో తన ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసి.. తిరిగి సిద్ధిపేట నుంచి గెలుపొంది తెలంగాణ భావ వ్యాప్తికి బీజం వేశారు. ఆచార్య కొత్తపల్లి జయశంకర్ వంటి మేధావుల సహకారంతో.. ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటు ప్రాధాన్యాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు ఉద్యమ పార్టీగా తెరాస గుర్తింపు పొందింది. 2014లో రాష్ట్రాన్ని సాధించేదాకా అనేక రాజకీయ ఎత్తుగడలతో ఉద్యమాన్ని నడిపింది. 2004లో కాంగ్రెస్‌తో పొత్తు పెట్టుకొని పోటీ చేయడమే కాకుండా ప్రభుత్వంలోనూ చేరింది. 2006లో కాంగ్రెస్ ప్రభుత్వం నుంచి బయటకు వచ్చి ఆందోళనల ద్వారా ఒత్తిడి పెంచింది. 2009 ఎన్నికల్లో తెలుగుదేశంతో పొత్తు పెట్టుకొని పోటీ చేసింది. మళ్లీ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావడం, తెలంగాణ కోసం రాజకీయ జేఏసీ ఏర్పాటు, కేసీఆర్ ఆమరణ నిరాహార దీక్షతో కేంద్రంలోని యూపీఏ ప్రభుత్వం తెలంగాణ ఇస్తున్నట్లు ప్రకటించడం, 2014 లోక్‌సభ ఎన్నికలకు ముందు తెలంగాణ రాష్ట్రాన్ని ఏర్పాటు చేస్తూ పార్లమెంటు చట్టం చేయడంతో ఉద్యమ దశ ముగిసింది.

**పునరుత్తేజం కల్పించే దిశగా..**

తెరాసతో పాటు కాంగ్రెస్, భాజపా, సీపీఐ ఇలా అన్ని ప్రధాన పార్టీలు తెలంగాణ రాష్ట్రం కోసం ఆయా పార్టీల నేతలపై ఒత్తిడి పెంచాయి. అయితే తెలంగాణ ఏర్పడిన తర్వాత ఉద్యమ పార్టీగా తెరాసకే రాష్ట్ర ప్రజలు పట్టం కట్టారు. రెండోసారి 2018 ఎన్నికల్లో భారీ మెజార్టీతో విజయం సాధించిన తెరాస.. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో ఓడిపోయింది. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో అత్యధిక స్థానాలను కోల్పోయింది. ఈ ఎన్నికలకు ముందే మహారాష్ట్ర, ఒడిశా, ఆంధ్రప్రదేశ్ తదితర రాష్ట్రాల్లో విస్తరించడానికి ప్రత్యేక కమిటీలు నియమించడం, సభలు ఏర్పాటు చేయడం ద్వారా జాతీయ పార్టీగా రూపాంతరం చెందేందుకు తెరాస.. భారాసగా మారింది. తర్వాత జరిగిన అసెంబ్లీ, పార్లమెంటు ఎన్నికల్లో ఓడిపోవడం పార్టీ శ్రేణులను తీవ్ర నిరాశకు గురిచేసింది. అయితే కొద్ది రోజులకే పార్టీ నాయకత్వం ప్రత్యేకించి.. కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్, మాజీ మంత్రి హరీశ్‌రావులు ప్రభుత్వ విధానాలపై పోరాటంలో నిమగ్నమయ్యారు. అంశాల మేరకు రాష్ట్రవ్యాప్తంగా పర్యటించడం, ప్రభుత్వంపై విమర్శలు గుప్పించడం ద్వారా తమ పార్టీ యంత్రాంగాన్ని చురుగ్గా ఉంచే ప్రయత్నం చేశారు. రజతోత్సవ సభకు సన్నాహకంగా ఇప్పటికే కేసీఆర్ అన్ని జిల్లాల నాయకులతో సమావేశాలు నిర్వహించారు. కేటీఆర్, హరీశ్‌రావులు పలు నియోజకవర్గాల్లో పర్యటించి శ్రేణులను సన్నద్ధం చేశారు. ఎమ్మెల్సీ కవిత, ఎమ్మెల్యేలు కూడా పలు నియోజకవర్గాల్లో పాల్గొన్నారు.

# కొత్త నాయకత్వం నిర్మితమవ్వాలి

- మొదటి పేజి తరువాయి
పాదయాత్ర చేపట్టినట్లు పేర్కొన్నారు. ప్రజాస్వామ్య విలువలను తిరిగి పొందడంతోపాటు వాటి సంరక్షణ వంటి ప్రాథమ్యాలను కొత్త రాజకీయ దృక్కోణం ద్వారా పునర్నిర్మించడం ఇప్పుడు అందరి ముందున్న నిజమైన సవాలని పేర్కొన్నారు. హైదరాబాద్‌లోని హెచ్ఐసీసీ నోవాటెల్‌లో శనివారం 'భారత్ సమ్మిట్' ముగింపు సందర్భంగా రాహుల్ గాంధీ ప్రసంగించారు. "దేశంలో కొన్నేళ్ల క్రితం ప్రతిపక్షాలకు దారులు క్రమంగా మూసుకుపోయిన సందర్భంలో కాంగ్రెస్ పార్టీపరంగా చిక్కులు ఎదుర్కొన్నాం. మా పార్టీ కోరుకున్న విధంగా నడుచుకునేందుకు అవకాశం లేకుండా పోయింది. దాదాపుగా ఒంటరి అయిన పరిస్థితులు నెలకొన్నాయి. దాన్ని అధిగమించడానికి ప్రజల్లోకి వెళ్లాలని నిర్ణయం తీసుకున్నాం. కన్యాకుమారి నుంచి కశ్మీర్ వరకు దాదాపు 4 వేల కిలోమీటర్ల మేర నేను స్వయంగా పాదయాత్ర చేయాలని నిర్ణయించుకున్నా. ఒకసారి దాన్ని ప్రారంభించిన తర్వాత వెనక్కి తిరిగి చూడలేదు.

**మనసుతో ఎలా వినాలో నేర్చుకున్నా..**

భారత్ జోడో యాత్రలో నేను లోతైన పాఠాలు నేర్చుకున్నాను. యాత్రలో వేల మంది మాతో చేరారు. నడవడం, వినడంపైనే పాదయాత్రలో దృష్టి సారించా. రోజులు గడిచేకొద్దీ మాట్లాడటం, ఆలోచించడం ఎలాగో నాకు తెలిసినప్పటికీ.. నేను ఇంతకు ముందెప్పుడూ పూర్తిగా లీనమై వినలేదని గ్రహించగలిగాను. పాదయాత్ర సాగుతున్నా కొద్దీ నేను మాట్లాడటం తగ్గిపోయింది. ప్రజలు చెప్పేది క్షుణ్ణంగా వినడం అలవాటైంది. సంభాషణలకు కొత్త అర్థం తెలిసింది. చెవులతోనే కాదు మనసుతో వినడమెలాగో నేర్చుకున్నా. వాస్తవానికి ప్రజలకు ఏం చేయాలో తెలుసు. వారి సమస్యలను పరిష్కరించే సామర్థ్యమున్న నేతలుగా మనం మాత్రం... వారు చెప్పేది వినడంలో విఫలమవుతున్నామని అనిపించింది. వారు చెప్పేది మనసుపెట్టి వినాలి తప్ప వారికి ఉపన్యాసాలు ఇవ్వకూడదని నాకు అర్థమైంది.

**ప్రజలతో నిజమైన అనుబంధం ఉండాలి**

'2004 నుంచి నేను రాజకీయాల్లో ఉన్నా. కానీ, ప్రజలతో ప్రేమను వ్యక్తపరచలేకపోయా. పాదయాత్రకు ముందు ప్రజలను కలిసినప్పుడు ఆప్యాయతతో మెలిగేందుకు ఇబ్బందిగా అనిపించేది. పాదయాత్రలో నన్ను కలిసిన ప్రజలతో ప్రేమగా మెలగడం అలవాటు చేసుకున్నా. అలా చేయడం ప్రారంభించిన తర్వాత అసాధారణ మార్పు గమనించా. ప్రజలు నాతో ఎక్కువగా మమేకం అవుతున్నారని అర్థమైంది. అప్పుడు ప్రజలతో కలవడం సులభమైపోయింది. ప్రస్తుతం సమావేశాల్లోనే కాకుండా బహిరంగ సభల్లోనూ ప్రజలు నా దగ్గరికి వచ్చి ఆప్యాయంగా పలకరిస్తున్నారు. భారత్ జోడో యాత్ర క్రమంలో నేను 'నఫ్రత్ కే బజార్ మే మొహబ్బత్ కా దుకాణ్(విద్వేషపు విపణిలో ప్రేమ దుకాణం)' తెరిచా. ఎవరెంత ద్వేషం వ్యాపింపజేసినా ప్రేమ, ఆప్యాయతలు అంతకన్నా శక్తిమంతమైనవి. ప్రజలు చెప్పేది వినడం, ప్రేమించడంతోపాటు వారితో నిజమైన అనుబంధాన్ని కలిగిఉండాలి" అని రాహుల్ గాంధీ అన్నారు. అంతకుముందు భారత్ సమ్మిట్‌లో పాల్గొనడానికి హైదరాబాద్‌కు చేరుకున్న రాహుల్ గాంధీకి శంషాబాద్ విమానాశ్రయంలో సీఎం రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, కాంగ్రెస్ రాష్ట్ర ఇన్‌ఛార్జి మీనాక్షి నటరాజన్, పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్, ప్రభుత్వ సలహాదారు హర్కర వేణుగోపాల్‌రావు తదితరులు సాదర స్వాగతం పలికారు. సమ్మిట్‌లో పాల్గొన్న అనంతరం దిల్లీ తిరిగి వెళ్లిపోయే సమయంలో నాయకులు వీడ్కోలు పలికారు.

**'భారత్ సమ్మిట్'లో అనేక విషయాలు నేర్చుకున్నాం: భట్టి**

తెలంగాణలో తమ ప్రభుత్వం చేసిన కార్యక్రమాలను చెప్పుకొనేందుకు 'భారత్ సమ్మిట్' ఒక వేదికగానే కాకుండా అనేక విషయాలు నేర్చుకునేందుకు ఉపయోగపడిందని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క పేర్కొన్నారు. శనివారం 'భారత్ సమ్మిట్' ముగింపు సమావేశంలో ఆయన మాట్లాడారు. "రాష్ట్ర ప్రభుత్వం పక్షాన సదస్సుకు దాదాపు వందకు పైగా దేశాల ప్రతినిధులను ఆహ్వానించడం గొప్ప విషయం. భారీ గ్లోబల్ సమ్మిట్‌ను హైదరాబాద్‌లో నిర్వహించడం గొప్ప అవకాశంగా భావిస్తున్నాం. తెలంగాణలో మా ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మొదటి రోజు

నుంచే ప్రజలు కేంద్రంగా అనేక కార్యక్రమాలు చేపట్టాం. వారే కేంద్రంగా ప్రజా పరిపాలన సాగిస్తున్నాం. అణగారిన, పేదవర్గాల కోసం అనేక అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు చేపడుతున్నాం. అహింస, స్వాతంత్ర్యం, శాంతి, సమానత్వం, ప్రగతిశీల భావజాలంతో పాటు మా అగ్రనేత రాహుల్ గాంధీ నుంచి విజన్ వంటి అంశాలను గ్రహించాం. ఇప్పటికే వీటిని కొనసాగిస్తున్నాం. భవిష్యత్తులో మా విధానాలు, పథకాలు, ఆలోచనల్లో వీటిని మరింత సమర్థంగా కొనసాగిస్తాం" అని భట్టి విక్రమార్క ఉద్ఘాటించారు. అంతకుముందు ఆయన చరఖా స్టాల్‌ను సందర్శించి.. నూలు వడికారు.

# ఏపీ లిక్కర్ స్కామ్ లోకల్ కాదు... ఇంటర్నేషనల్

వైసీపీ పాలనలో ఇంటర్నేషనల్ స్థాయిలో లిక్కర్ స్కామ్ జరిగిందని టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు, సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి అమరావతిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో ఈరోజు మీడియాతో మాట్లాడుతూ అన్నారు. రూ.1.30 లక్షల కోట్ల విలువైన నగదు లావాదేవీలు జరగడం దేశంలో ఎక్కడైనా చూశామా అని ఆయన ప్రశ్నించారు. అక్రమంగా దోచేయడం కోసమే మద్యం వ్యాపారంలో డిజిటల్ పేమెంట్లను జగన్ సర్కార్ అనుమతించలేదని ఆరోపించారు.ఓ వైపు ప్రధానమంత్రి మోదీ డిజిటల్ ఇండియా అంటుంటే జగన్ రెడ్డి మాత్రం క్యాష్ ఆంధ్రప్రదేశ్‌గా మార్చారని విమర్శించారు. ప్రస్తుతం ఈ కుంభకోణంపై విచారణ సాగిస్తున్న సిట్ మరింత లోతుగా వెళ్లాల్సిన అవసరం ఉందన్నారు. ఏపీ లిక్కర్ స్కామ్ రూ. 3200 కోట్లకు పరిమితం కాలేదని, రూ.10 వేల కోట్లకు పైనే అని అన్నారు. వేల కోట్ల అక్రమాలు, మనీ లాండరింగ్ జరిగితే ఈడీ, సీబీఐ ఎందుకు రంగంలో దిగడం లేదని ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రశ్నించారు. రూ.1.30 లక్షల కోట్ల క్యాష్ ట్రాన్సాక్షన్ జరుగుతుంటే గత ఐదేళ్లు ఈడీ, సీబీఐ ఈ కుంభకోణంపై ఎందుకు దృష్టి సారించలేదన్నారు. 1989లో రూ.60 కోట్ల విలువైన బోఫోర్స్ కుంభకోణం రాజీవ్ గాంధీ కొంపముంచిందని, 2014లో 2జీ స్కాం మన్మోహన్ సింగ్‌ను దెబ్బకొట్టిందని గుర్తు చేశారు. ఈ రెండు స్కాములు కాంగ్రెస్ పార్టీకి జాతీయ హోదా కోల్పోయే పరిస్థితి తెచ్చాయన్నారు. ఏపీలో జరిగిన లిక్కర్ స్కామ్ ఆషామాషీ కేసు కాదని తెలిపారు. కరోనా సమయంలో 2020 మార్చి 23న లాక్ డౌన్ విధించారు... మే 4న మద్యం దుకాణాలను రీ ఓపెనింగ్ చేశారు... ఆ 42 రోజులు మాత్రమే మద్యం విక్రయాలు ఆగాయని, కానీ లక్షల క్రేట్ల మద్యం విక్రయాలు తగ్గిపోయినట్లు లెక్క చూపించారని ఎమ్మెల్యే మండిపడ్డారు. జగన్ రెడ్డి పర్యవేక్షణలో నడిచిన కసిరెడ్డి అండ్ టీం ఎక్సైజ్ డిపార్టుమెంటులోని మద్యం డిపోలకు వెళ్లకుండా, స్కానింగ్ కాకుండా డిస్టిలరీల నుంచి నేరుగా దుకాణాలకు స్టాక్ తరలించి అక్రమంగా అమ్మేసుకున్నారని ఆరోపించారు. మాగుంట శ్రీనివాసులు రెడ్డి కుటుంబానికి చెందిన మెక్ డోవెల్ డిస్టిలరీ మూసుకునే పరిస్థితి వచ్చిందన్నారు. అడిగినంత కమీషన్లు ఇవ్వలేదని నేషనల్, ఇంటర్నేషనల్ బ్రాండ్ల డిస్టిలరీలను అడ్డంగా మూసేశారని ఆరోపించారు. ఇతర రాష్ట్రాల నుంచి 3 బాటిల్స్ తీసుకునే వెసులుబాటును కూడా తొక్కేశారని, తామిచ్చిన మద్యమే తాగాలని నియంతలా వ్యవహరించారని... జగన్ రెడ్డి అండ్ బ్యాచ్ కు డబ్బుపై ఉన్న వ్యామోహంతోనే ఇది జరిగిందని ఎమ్మెల్యే సోమిరెడ్డి అన్నారు. ఐఎస్ఐ గుర్తింపు పొందిన చెన్నైలోని ప్రముఖ ఎస్.జీ.ఎస్ లేబరేటరీ జగన్ ప్రభుత్వం విక్రయించిన సొంత మద్యం బ్రాండ్లపై సంచలన విషయాలను బయటపెట్టిందని ఈ సందర్భంగా ఆయన గుర్తుచేశారు. వైసీపీ ప్రత్యేకంగా ప్రోత్సహించిన ఆంధ్రా గోల్డ్, 9సీ హార్సెస్, సిల్వర్ స్ట్రైప్ విస్కీలలో ప్రమాదకరమైన పైరోగలాల్, ఐసోఫులరిక్ యాసిడ్, డైఇథనాల్ టాలెట్ ఉన్నాయని తేల్చిందన్నారు. ఇవి తాగితే శరీరంలోని అవయవాలు దెబ్బతిని ప్రాణాలు కోల్పోతారని స్పష్టంగా నివేదికలు ఉన్నాయని తెలిపారు. ఏపీలో కల్తీ మద్యం తాగి ఎస్సీలు, ఎస్టీలు, బీసీలు వేల మంది ప్రాణాలు కోల్పోయారు. లక్షల మంది మంచాన పడ్డారని ఎమ్మెల్యే ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజల ఓట్లతో సీఎంగా ఎన్నికైన వ్యక్తి వారి జేబుల్లోని డబ్బును లాక్కోవడమే గాక వారి ప్రాణాలను తీసేయడం దుర్మార్గమన్నారు.కసిరెడ్డి అండ్ బ్యాచ్ మద్యం వ్యాపారాన్ని తమ చేతుల్లోకి తీసుకుందని, డిస్టలరీలను తమ గుప్పెట్లో పెట్టుకుని నాసిరకమైన మద్యం తయారు చేయించిందని ఎమ్మెల్యే సోమిరెడ్డి ఆరోపించారు. బ్రాండ్ ను బట్టి క్రేట్(48 బాటిల్స్) కు రూ.150 నుంచి రూ.600 చొప్పున కమీషన్ వసూలు చేశారని, అనఫిషియల్ సేల్ తో ఒక్కో క్రేట్ కు రూ.10 వేల వరకు ఆర్జించారని తెలిపారు. నడిబజారులో జరిగిన ఈ స్కామ్ ప్రత్యక్షంగా కనిపిస్తోంది.. కేంద్ర ప్రభుత్వం వెంటనే జోక్యం చేసుకుని ఈడీ, సీబీఐలను రంగంలోకి దించాలని ఆయన కోరారు. రూ.1000 లంచం తీసుకున్న ప్రభుత్వ ఉద్యోగిని ఏసీబీ అరెస్ట్ చేసి జైలుకు పంపుతుందని, వేల కోట్లు దోచేసి ప్రజల ప్రాణాలు తీసేసిన వారికి ఏ శిక్ష వేయాలని ప్రశ్నించారు. క్యాష్ ట్రాన్సాక్షన్ కరెక్ట్ అని, ఈ మందు తాగినందున ఎవరూ చనిపోలేదు అని వైసీపీలోని పెద్ద నాయకులు, జగన్ రెడ్డి రైట్లు, లెఫ్టులు ఎవరైనా చెప్పగలరా అని ఈ సందర్భంగా ఎమ్మెల్యే సోమిరెడ్డి సవాల్ చేశారు. మధ్యలో లక్షల క్రేట్ల మద్యం సేల్ ఎందుకు తగ్గిపోయిందో సమాధానం చెబుతారా అని ప్రశ్నించారు. మద్యపాన నిషేధం అమలు చేస్తానని చెప్పి కల్తీ మద్యం పోసి ప్రాణాలు తీయడం క్షమించరాని నేరం అన్నారు.

# సీఎం రేవంత్ రెడ్డి కూడా అలాగే ఉన్నారని తెలుసుకోండి

లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ హైదరాబాద్ పర్యటన నేపథ్యంలో బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ఆయనపై తీవ్ర విమర్శలు గుప్పించారు. కాంగ్రెస్ నాయకులు తన కేసుల గురించి మాట్లాడుతున్నారని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కూడా బెయిల్‌పై ఉన్నారనే విషయం తెలుసుకోవాలని అన్నారు. రాహుల్ గాంధీ కేవలం 'ఎన్నికల గాంధీ' మాత్రమేనని, తెలంగాణ ప్రజల ఓట్లు కావాలి కానీ వారి కష్టసుఖాలు పట్టవని ఆరోపించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత చోటుచేసుకున్న పలు సంఘటనలను ప్రస్తావిస్తూ రాహుల్ గాంధీని ఆమె నిలదీశారు."కాంగ్రెస్ ప్రభుత్వం బుల్డోజర్లతో పేదల ఇళ్లను కూల్చివేసినప్పుడు, హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో పచ్చని చెట్లను నరికివేయిస్తున్నప్పుడు, ఉద్యోగాలు అడిగిన విద్యార్థులపై లాఠీఛార్జ్ జరిగినప్పుడు, లగచర్లలో బంజారా మహిళలపై అఘాయిత్యాలు జరిగినప్పుడు రాహుల్ గాంధీ ఎందుకు స్పందించలేదు?" అని ఆమె ప్రశ్నించారు.తెలంగాణ ప్రజలు పిలిస్తే వందసార్లు వస్తానని చెప్పిన రాహుల్, గత 16 నెలలుగా ఎక్కడ ఉన్నారని నిలదీశారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఆరు గ్యారంటీలతో పాటు 420 హామీలలో ఒక్కటి కూడా నెరవేర్చలేదని విమర్శించారు. హైదరాబాద్ పర్యటనలో భాగంగా, కాంగ్రెస్ ప్రభుత్వంలో లాఠీ దెబ్బలు తిన్న విద్యార్థులను రాహుల్ గాంధీ పరామర్శించాలని డిమాండ్ చేశారు.కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను, ఇచ్చిన హామీలను ప్రశ్నిస్తే ఉప ముఖ్యమంత్రి, పీసీసీ అధ్యక్షుడు తనపై, తన కేసుల గురించి వ్యక్తిగత ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు. అయితే, విమర్శలు చేసే ముందు సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కూడా బెయిల్‌పై ఉన్నారన్న విషయాన్ని గుర్తుంచుకోవాలని హితవు పలికారు. ఎదుటివారి వైపు ఒక వేలు చూపిస్తే, తమ వైపు నాలుగు వేళ్లు చూపిస్తాయన్నది తెలుసుకోవాలని అన్నారు.

## పరిహారం సొమ్ము ఆదా చేయాలనే
# పోలవరం ఎత్తు తగ్గింపు

- మొదటి పేజి తరువాయి
విలేకర్లతో మాట్లాడారు.
'41 మీటర్ల ఎత్తుతోనే ప్రాజెక్టు కడతామని గత ముఖ్యమంత్రి జగన్ నాడు కేంద్ర ప్రభుత్వం ముందు లొంగిపోయారు. అప్పట్లో ప్రతిపక్ష నేతగా దీనిపై ప్రశ్నించిన చంద్రబాబు.. ముఖ్యమంత్రి అయ్యాక ఆయనా అదే చేస్తున్నారు. ప్రాజెక్టు ఎత్తును 41 మీటర్లకు కుదించినప్పటికీ, గోదావరిలో వరద వచ్చినప్పుడు 45 మీటర్ల ఎత్తులోని గ్రామాలు కూడా మునిగిపోతాయి. కాబట్టి, 45 మీటర్ల ఎత్తుతోనే నిర్మిస్తామని చంద్రబాబు హామీ ఇవ్వాల'ని షర్మిల డిమాండ్ చేశారు. 'నష్టపరిహారం ఇవ్వడంలో గతంలో జగన్ కుట్ర చేశారు. నిర్వాసిత గ్రామాల్లో వీధికి ఇవతలి వైపున 41 మీటర్లు, ఆవలి వైపున 45 మీటర్లుగా విభజించారు. వరద నీటికి వీధికి ఇవతలి వైపా.. అవతలి వైపా అని తెలియదు కదా?' అని ప్రశ్నించారు. పునరావాస గ్రామాల్లో మౌలిక వసతులు కల్పించాలని, నిర్వాసితుల భూములకు బ్యాంకు రుణాలు అందించాలని, ప్రభుత్వ సబ్సిడీలు, పంటనష్టం పరిహారం ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరారు.

## కర్రెగుట్టల్లో భారీ ఎన్‌కౌంటర్.. 38 మంది నక్సలైట్లు మృతి!

- మొదటి పేజి తరువాయి
డీఆర్‌జీ బస్తర్ ఫైటర్ కోబ్రా, సీఆర్‌పీఎఫ్, ఎస్‌టీఎఫ్ సైనికులు భారీ కూంబింగ్ చేస్తున్నాయి. ఈ క్రమంలో ఈరోజు జరిగిన ఎదురు కాల్పుల్లో సుమారు 38 మంది నక్సలైట్లు మృతిచెందినట్లు తెలుస్తోంది. మృతుల సంఖ్య ఇంకా భారీగా పెరిగే అవకాశం ఉందని సమాచారం. కానీ, మావోల మృతిపై ఇప్పటివరకు అధికారులు ఎలాంటి అధికారిక ప్రకటన చేయలేదు. కాగా, కర్రెగుట్టల కూంబింగ్ కొనసాగుతున్న వేళ శుక్రవారం మధ్యాహ్నం బస్తర్ మావోయిస్టుల ఇంచార్జ్ పేరిట లేఖ ఒకటి విడుదలైంది. ఆ లేఖలో ఆపరేషన్ కగార్‌ను వెంటనే నిలిపి వేయాలని, తాము శాంతి చర్చలకు సిద్ధమని కేంద్రంతో పాటు ఆయా రాష్ట్ర ప్రభుత్వాలకు మావోలు విజ్ఞప్తి చేశారు.

## స్టూడెంట్ వీసాపై వెళ్లి.. ఉగ్రవాదిగా మారి

- మొదటి పేజి తరువాయి
నుంచి పాకిస్తాన్ వెళ్లే ముందు సరిహద్దు అవతల పనిచేస్తున్న నిషేధిత ఉగ్రవాద సంస్థలతో సంబంధాలు కలిగి ఉన్నాడు. స్టూడెంట్ వీసాపై పాకిస్తాన్‌లో చేరిన తర్వాత తన కుటుంబంతో సంబంధాలను తెంచుకు న్నాడు. దాదాపు ఎనిమిది నెలల పాటు అతను ఎక్కడున్నాడనేది కుటుంబ సభ్యులకు తెలియలేదు. థోకర్ 2024 అక్టోబర్‌లో పూంచ్-రాజౌరి సెక్టార్ ద్వారా నియంత్రణ రేఖ దాటి ఇండియాలోకి వచ్చినట్టు నిఘా వర్గాలు నిర్ధారణకు వచ్చాయి. ఈ ప్రాంతంలోని భూభాగం నిటారుగా ఉన్న కొండలు, దట్టమైన అడవులు ఉంటాయి. ఇక్కడి నుంచి రావడం చాలా కష్టమని నిఘా వర్గాలు చెబుతున్నాయి. ఈ సమయంలో థోకర్ తోపాటు నలుగురు వ్యక్తులు కూడా భారత భూభాగంలోకి వచ్చాయి. వారిలో ఒకరు పాకిస్తానీ జాతీయుడు, పహల్గామ్ ఉగ్రవాద దాడిలో మరొక ప్రధాన నిందితుడు హషీమ్ ముసా, అతని అలియాస్ సులేమాన్ అని కూడా పిలుస్తారు. వీళ్లంతా భారత్ భూభాగంలోకి ప్రవేశించడంలో థోకర్ కీలక పాత్ర పోషించినట్టు నిఘా వర్గాలు అంచనాకు వచ్చాయి. జమ్మూలోకి వచ్చిన తర్వాత కొండలు, అటవీ ప్రాంతాల్లో నివాసం ఉన్నట్టు తెలుస్తోంది. అతనితోపాటు వచ్చిన పాకిస్తానీకి రహస్య స్థావరం ఏర్పర్చినట్టు నిఘా వర్గాలు అంచనా వేస్తున్నాయి.

## ఏం జరిగినా ఎదుర్కొంటాం: పహల్గాం ఉగ్రదాడిపై నోరు విప్పిన పాక్ ప్రధాని

- మొదటి పేజి తరువాయి
పఖ్తుంఖ్వాలోని పాకిస్తాన్ మిలిటరీ అకాడమీ గ్రాడ్యుయేషన్ వేడుకల్లో పాల్గొన్న షెహబాజ్ షరీఫ్.. ఉద్రిక్తతల గురించి స్పందించారు. "పహల్గాంలో ఇటీవల జరిగిన విషాదకర ఘటనతో మరోసారి మన దేశం నిందలు ఎదుర్కొంటోంది. ఆ ఘటనపై తటస్థ, పారదర్శక, విశ్వసనీయ దర్యాప్తులో పాల్గొనేందుకు మేం సిద్ధంగా ఉన్నాం. శాంతికే మా ప్రాధాన్యం" అని షరీఫ్ తెలిపారు. ఉగ్రవాదాన్ని తాము కూడా ఖండిస్తామంటూ శాంతి వచనాలు వల్లె వేశారు.ఈసందర్భంగా ఉగ్రవాదాన్ని సమూలంగా నాశనం చేస్తామంటూ ఇటీవల భారత ప్రధాని మోదీ చేసిన వ్యాఖ్యలపై షరీఫ్ పరోక్షంగా స్పందించారు. "మా దేశ భద్రత, సార్వభౌమత్వంపై ఎన్నటికీ రాజీపడబోం. ఎలాంటి ముప్పును ఎదుర్కోడానికైనా సంసిద్ధంగా ఉన్నాం" అని తెలిపారు. అనంతరం సింధూ జలాల ఒప్పందం నిలిపివేత అంశాన్ని ప్రస్తావిస్తూ.. "భారత్ ఇలా ఏకపక్షంగా నిర్ణయం తీసుకోవడం తగదు. ఈ చర్యతో యుద్ధ వాతావరణాన్ని సృష్టిస్తున్నారు. చర్చల ద్వారా సమస్యను పరిష్కరించుకోవాలని మేం కోరుకుంటున్నాం" అంటూ భారత్‌ను నిందించే ప్రయత్నం చేశారు.ఏప్రిల్ 22న పహల్గాంలో జరిగిన దాడిలో 26 మంది ప్రాణాలు కోల్పోయిన సంగతి తెలిసిందే. దీని వెనక పాక్ కేంద్రంగా పనిచేస్తోన్న లష్కరే తోయిబా అనుబంధ సంస్థ 'ది రెసిస్టెన్స్ ఫోర్స్' హస్తం ఉన్నట్లు భద్రతా బలగాలు భావిస్తున్నారు. ఈ క్రమంలోనే సీమాంతర ఉగ్రవాదాన్ని ప్రోత్సహిస్తోన్న పాకిస్థాన్‌కు భారత్ గట్టి షాకిచ్చింది. సింధూ జలాల ఒప్పందం నిలిపివేతతో పాటు పలు కీలక నిర్ణయాలు తీసుకుంది. పాక్ పౌరులు తక్షణమే దేశం విడిచి వెళ్లిపోవాలని ఆదేశించింది. అటు పాక్ కూడా ప్రతిచర్యలు చేపట్టింది. భారత విమానాలకు తమ గగనతలాన్ని మూసివేస్తున్నట్లు ప్రకటించింది.


## పోప్ ఫ్రాన్సిస్‌కు అశ్రునివాళి.. అంత్యక్రియలకు హాజరైన భారత రాష్ట్రపతి ముర్ము, ప్రపంచ నేతలు

రోమన్ క్యాథలిక్ చర్చి అధినేత పోప్ ఫ్రాన్సిస్ అంత్యక్రియలు వాటికన్‌లోని సెయింట్ పీటర్స్ స్క్వేర్‌లో శనివారం అత్యంత భక్తిశ్ర ద్ధలతో, వేలాది మంది అశ్రునయనాల మధ్య జరిగా యి. ఈ కార్యక్రమానికి సుమారు 2.5 లక్షల మందికి పైగా విశ్వాసులు, ప్రపంచవ్యాప్తంగా 100కు పైగా దేశాల ప్రతినిధులు, పలువురు దేశాధినేతలు, ప్రముఖులు హాజరై దివంగత పోప్‌కు తుది వీడ్కోలు పలికారు. భారత ప్రభుత్వం తరఫున రాష్ట్రపతి ద్రౌపది ముర్ము నేతృత్వంలోని ఉన్నతస్థాయి బృందం ఈ అంత్యక్రియలకు హాజరైంది.
సెయింట్ పీటర్స్ బేసిలికా ప్రాంగణంలో జరిగిన ఈ ప్రత్యేక ప్రార్థనలకు కార్డినల్ జియోవన్నీ బటిస్టా రే నేతృత్వం వహించారు. దాదాపు రెండు గంటల పాటు సాగిన ఈ కార్యక్రమంలో సుమారు 250 మంది కార్డినల్స్, ఆర్చ్‌బిషప్‌లు, బిషప్‌లు, మత గురువులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కార్డినల్ రే మాట్లాడుతూ.. పోప్ ఫ్రాన్సిస్ ప్రజల మనిషి అని, అందరి పట్ల విశాల హృదయంతో వ్యవహరించారని కొనియాడారు. అనారోగ్యంతో బాధపడుతున్నప్పటికీ చివరి క్షణం వరకు తన కర్తవ్యాన్ని నిబద్ధతతో నిర్వర్తించారని గుర్తు చేసుకున్నారు. "గత ఈస్టర్ ఆదివారం నాడు కూడా తీవ్ర అనారోగ్యంతో ఉన్నప్పటికీ, సెయింట్ పీటర్స్ బేసిలికా బాల్కనీ నుంచి ఆయన మనందరినీ ఆశీర్వదించిన దృశ్యం మన మదిలో చిరకాలం నిలిచిపోతుంది" అని కార్డినల్ రే పేర్కొన్నారు. ప్రపంచంలో యుద్ధాల వల్ల జరుగుతున్న నష్టాన్ని చూసి పోప్ తీవ్రంగా కలత చెందారని, శాంతి స్థాపన కోసం, చర్చల ద్వారా సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పిలుపునిచ్చారని ఆయన వివరించారు.అంత్యక్రియల ప్రార్థనల అనంతరం, పోప్ ఫ్రాన్సిస్ పార్థివ దేహాన్ని ప్రత్యేక వాహనంలో రోమ్‌లోని 'బేసిలికా డి శాంటా మారియా మగ్గియోరే'కు తరలించారు. పోప్ ఫ్రాన్సిస్ తన వీలునామాలో పేర్కొన్న ప్రకారం, వాటికన్ గోడల వెలుపల ఈ బేసిలికాలో ఆయన భౌతికకాయాన్ని ఖననం చేశారు. శతాబ్ద కాలంలో వాటికన్ వెలుపల ఖననం చేయబడిన తొలి పోప్... పోప్ ఫ్రాన్సిస్ కావడం గమనార్హం. కార్డినల్ కెవిన్ ఫారెల్ ఆధ్వర్యంలో ఖనన ప్రక్రియ పూర్తయింది.భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ముతో పాటు కేంద్ర మంత్రులు కిరణ్ రిజిజు, జార్జ్ కురియన్, గోవా శాసనసభ డిప్యూటీ స్పీకర్ జోషువా డిసౌజా తదితరులు భారత ప్రతినిధి బృందంలో ఉన్నారు. అమెరికా మాజీ అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్, ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మాక్రాన్, బ్రెజిల్ అధ్యక్షుడు లూయిజ్ ఇనాసియో లులా డ సిల్వా, అర్జెంటీనా అధ్యక్షుడు జేవియర్ మిలీ, బ్రిటన్ యువరాజు విలియం, బ్రిటన్ ప్రధాని కీర్ స్టార్‌మర్ సహా పలువురు ప్రపంచ నేతలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. భద్రతా కారణాల దృష్ట్యా రోమ్ నగరం అంతటా 2000 మందికి పైగా పోలీసులను మోహరించారు.

## ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు మరో పథకం ప్రారంభించాం

ఏపీలో మత్స్యకారుల సేవలో పథకాన్ని ప్రారంభించారు. దీనిపై సీఎం చంద్రబాబు ఎక్స్ లో స్పందించారు. ఎన్నికలలో ఇచ్చిన హామీకి అనుగుణంగా మత్స్యకారులకు వేట విరామ కాలంలో అందించే ఆర్థిక సాయాన్ని పెంచుతూ తీసుకున్న నిర్ణయాన్ని అమలు చేయడం సంతోషంగా ఉందని పేర్కొన్నారు. గతంలో రూ.10 వేలుగా ఉన్న ఈ సహాయాన్ని రూ. 20 వేలకు పెంచామని, ఈ పథకం కింద నేడు 1,29,178 మంది మత్స్యకారులకు ఒక్కొక్కరికి రూ. 20 వేల చొప్పున మొత్తం రూ. 258.35 కోట్లను వారి ఖాతాల్లో జమ చేసినట్లు ఆయన వెల్లడించారు. వేట నిషేధ సమయంలో ఆదాయం లేక మత్స్యకారులు పడే ఇబ్బందులను తాను ప్రత్యక్షంగా చూశానని, వారి కష్టాలను దృష్టిలో ఉంచుకొనే ఈ సాయాన్ని రెట్టింపు చేయాలని నిర్ణయించినట్లు చంద్రబాబు తెలిపారు. కష్టపడి పనిచేసే స్వభావం ఉన్నవారికి అండగా నిలవడం ప్రభుత్వ ప్రాథమిక కర్తవ్యమని స్పష్టం చేశారు.ఈ పథకం ప్రారంభం సందర్భంగా తాను శ్రీకాకుళం జిల్లా ఎచ్చెర్ల నియోజకవర్గ పరిధిలోని బుడగట్లపాలెం గ్రామాన్ని సందర్శించినట్లు ముఖ్యమంత్రి చంద్రబాబు వెల్లడించారు.
అక్కడ మత్స్యకార సోదరులతో నేరుగా మాట్లాడి వారి సాధకబాధకాలను అడిగి తెలుసుకున్నానని వివరించారు. ప్రభుత్వ పరంగా వారికి అన్ని విధాలా మేలు చేసే కార్యక్రమాలు చేపడతామని భరోసా ఇచ్చినట్లు తెలిపారు. ఆ కష్టజీవులతో గడిపిన సమయం, రాష్ట్ర ప్రజల కోసం మరింత కష్టపడి పనిచేయాలనే తన సంకల్పాన్ని మరింత దృఢపరిచిందని చంద్రబాబు వ్యాఖ్యానించారు.

# నవ వధువుకు బంగారు తాళిబొట్టు పట్టుబట్టలు అందజేత



సి కే న్యూస్ విశాఖపట్నం ప్రతినిధి ( రవికుమార్ ) ఏప్రిల్ 26 : స్థానిక 33వ వార్డు నీలమ్మవేపచెట్టు ప్రాంతానికి చెందిన నవ వధువు లావణ్య కు విశాఖ దక్షిణ నియోజకవర్గ జనసేన పార్టీ నాయకులు, 32వ వార్డు కార్పొరేటర్ కందుల నాగరాజు, నళినీ దేవి దంపతులు బంగారు తాళిబొట్టు, పట్టుబట్టలు, పసుపు కుంకుమ అందజేశారు. ఈ సందర్భంగా కందుల నాగరాజు మాట్లాడుతూ గత నాలుగు దశాబ్దాలుగా తాను ఈ నియోజకవర్గ పరిధిలోని పలు ప్రాంతాల్లో ఎన్నో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నానని చెప్పారు. ఎవరిని డోనేషన్ అడగకుండా తన సొంత నిధులతోనే ఏళ్ల తరబడి సేవా కార్యక్రమాలు కొనసాగిస్తున్నట్లు వెల్లడించారు. 32వ వార్డు మాత్రమే కాకుండా దక్షిణ నియోజకవర్గ పరిధిలోని ఇతర ప్రాంతాల్లో కూడా ఎమ్మెల్యే వంశీ కృష్ణ శ్రీనివాస్ సహకారంతో సేవా కార్యక్రమాలతో పాటు అభివృద్ధి కార్యక్రమాలు కూడా చేపడుతున్నట్లు వెల్లడించారు.

# మహిళలు ఉచిత కుట్టు మిషన్ శిక్షణను సద్వినియోగంచేసుకోవాలి-కందుల నాగరాజు



సి కే న్యూస్ విశాఖపట్నం ప్రతినిధి ( రవికుమార్ ) ఏప్రిల్ 26 : మహిళలు ఉచిత కుట్టు మిషన్ శిక్షణను సద్వినియోగం చేసుకొని ఉపాధి అవకాశాలను పొందాలని విశాఖ దక్షిణ నియోజకవర్గం జనసేన పార్టీ నాయకులు, 32వ వార్డు కార్పొరేటర్ కందుల నాగరాజు అన్నారు.

స్థానిక ఎమ్మెల్యే వంశీ కృష్ణ శ్రీనివాస్ సహకారంతో 32వ వార్డులో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నట్లు చెప్పారు. బీసీ ఫైనాన్స్ కార్పొరేషన్ అండ్ ఇ డబ్ల్యు ఎస్ సహకారంతో 32వ వార్డు అల్లిపురం , నెరేళ్ల కోనేరు ప్రాంతంలో ఉచిత కుట్టు మిషన్ శిక్షణ కార్యక్రమాన్ని ముఖ్య అతిధిగా పాల్గొని ఆయన ప్రారంభించారు.

ఈ సందర్భంగా కందుల నాగరాజు మాట్లాడుతూ కుటుంబాల్లో ఒకరి సంపాదన చాలని విధంగా రోజురోజుకు ఖర్చులు పెరిగిపోతున్నాయని అన్నారు. నిత్యావసరాలే కాదు.. పిల్లలను చదివించాలంటే రూ.వేలు. రూ. లక్షల్లో ప్రణాళిక బద్ధంగా సిద్ధం చేసుకోవాల్సి వస్తోందని చెప్పారు.

నగరాలు, పట్టణాలే కాకుండా మారుమూల గ్రామాల్లో సైతం మహిళలు ఉపాధి అవకాశాలు వెతుక్కోవాల్సిన పరిస్థితులు ఎదురవుతున్నాయని అన్నారు. ఈక్రమంలో రాష్ట్ర ప్రభుత్వం మహిళా స్వావలంబన దిశగా అలోచించిందని పేర్కొన్నారు. ఆర్థికంగా ఏదగడానికి తోడ్పాటు అందివ్వాలని సంకల్పించిందని తెలిపారు. ఆ దిశగా ముందడుగు వేసిందని అన్నారు. ఉచితంగా కుట్టుశిక్షణతో పాటు మిషన్ కూడా ఇచ్చేందుకు శరవేగంగా చర్యలు చేపట్టిందని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో జోనల్ ఆఫీస్ ఏ పిడి పద్మావతి , బీసీ కార్పొరేషన్ ఇడి శ్రీదేవి , అప్పారావు , షేక్ నజీర్ , సిఓ మంగ , బీసీ కార్పొరేషన్ బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# జీవీఎంసీ పారిశుద్ధ కార్మికులకు సంతాప సభ



సి కే న్యూస్ విశాఖపట్నం ప్రతినిధి ( రవికుమార్ ) ఏప్రిల్ 26 : శ్రీ స్వామి వివేకనంద స్వచ్ఛంద సేవా సంస్థ వారు ఇటీవలే మరణించిన జీవీఎంసీ పారిశుద్ధ కార్మికురాలు కీర్తిశేషులు. గుర్రాల. రత్నం మరియు కార్మికురాలు తల్లి అయిన కీర్తిశేషులు జోగా పైడితల్లి కి సంతాప సభ కార్యక్రమం నిర్వహించారు. జహీర్ అహ్మద్ వాళ్ల చిత్రపటాలకు పూలను సమర్పించారు. వివేకానంద సంస్థ గౌరవ అధ్యక్షులు డాక్టర్. జహీర్ అహ్మద్ మరియు జీవీఎంసీ పారిశుద్ధ సిబ్బంది, సంస్థ సభ్యులు మౌనం పాటించి సంతాపం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా జహీర్ అహ్మద్ వారి కుటుంబ సభ్యులకు సానుభూతి తెలుపుతూ, మనో ధైర్యాన్ని కలిగి ఉండాలని, జీవీఎంసీ సిబ్బంది నిరంతరం పరిశుభ్రత కార్యక్రమంలో ప్రధాన పాత్ర పోషిస్తూ, అందరికీ ఆరోగ్యాన్ని అందిస్తూ, ఇటు సంస్థ వారి సేవలో పాల్గొంటూ సంస్థకు అనుబంధంగా నిలుస్తున్నారు అని ఆయన తెలియజేశారు. వివేకానంద సంస్థ ట్యూషన్ విద్యార్థులు భగవద్గీత శ్లోకాలను అధ్యయనం చేశారు. అనంతరం సంస్థ వారు నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సంతాప సభ కార్యక్రమంలో సంస్థ అధ్యక్షులు అప్పారావు, సంస్థ సభ్యులు అప్పలకొండ, పైడిరాజు, మహిళా సభ్యులు , గుర్రాల రత్నం కుటుంబ సభ్యులు, పైడితల్లి కుటుంబ సభ్యులు మరియు ట్యూషన్ విద్యార్థులు పాల్గొన్నారు.

# కార్పొరేట్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా 'మేడే'ను జరుపుదాం.

- వాడవాడలా 'మేడే' జెండా ఎగరాలి.
- అమానవీయ ఉగ్రదాడి కాండిద్దాం.
- కేంద్రం ఏనిర్ణయం స్వాగతిస్తుంది.
- మండలాల కౌన్సిల్ సమావేశంలో సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ కె సాబీర్ పాషా.




సీ కే న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, ( సాయి కౌశిక్),ఏప్రిల్ 26,చుంచుపల్లి/కొత్తగూడెం : కార్మికవర్గం పోరాడి సాధించుకున్న చట్టాలు, హక్కులను యాజమాన్యాలకు అనుకూలంగా మారుస్తూ కార్పొరేట్ జపం వల్లిస్తున్న కేంద్రంలో కార్పొరేట్ ప్రభుత్వాన్ని తట్టిలేపేవిధంగా మేడే ఉత్సవాలు జరుపుకోవాల్సిన అవసరం ఉందని సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ కె సాబీర్ పాషా అన్నారు. చుంచుపల్లి కమ్మవారి కల్యాణమండపంలో జరిగిన కొత్తగూడెం టౌన్, లక్ష్మీదేవిపల్లి, చుంచుపల్లి, సుజాతనగర్, జూలూరుపాడు, చంద్రుగొండ, అన్నపురెడ్డిపల్లి మండలాల సిపిఐ కౌన్సిల్ సభ్యుల సమావేశానికి అయన ముఖ్య అతిధిగా హాజరై మాట్లాడారు. పాలకులెవరైనా కార్మికుల హక్కులను కాలరాస్తూ, ప్రజా సంక్షేమాన్ని విస్మరించి పాలనా సాగిస్తున్నారని ఆరోపించారు. కార్మికులు, ఉద్యోగుల హక్కులను వాడా పారిశ్రామిక, కార్పొరేట్ల కోసం నిర్వీర్యం చేస్తున్నారని, దేశ సంపదను సృష్టిస్తున్న కర్మవర్గ చట్టాల అమలు కోసం ఎర్ర జెండాను చేతబట్టుకొని పోరాడాలన్నారు, ఐక్య పోరాటాలే సమస్యలకు పరిస్కారం మార్గమన్నారు. కేంద్రంలోని మోడీ ప్రభుత్వం ప్రజాస్వామ్యాన్ని ఖుని చేస్తూ అల్లర్లకు తెరలేపుతోందని, మందబలంతో అడ్డగోలు చట్టాలను తీసుకువస్తున్నారని విమర్శించారు. పెహల్గామ్ పర్యాటక ప్రాంతంలో జగిరినా ఉగ్రదాడి అమానవీయమని, దీని ప్రతిఒక్కరు ఖండించాలన్నారు. ఉగ్రవాదాన్ని అంతం చేసేందుకు కేంద్రం ఏ నిర్ణయం తీసుకున్న సిపిఐ స్వాగతిస్తుందన్నారు. ప్రతి గ్రామంలో, బస్తీలో, కార్మిక క్షేత్రాల్లో మేడే ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలని పిలుపునిచ్చారు. సమావేశ అనంతరం మేడే వాల్ పోస్టర్లను విడుదల చేశారు. సమావేశంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు నరాటి ప్రసాద్, దుర్గరాసి వెంకటేశ్వర్లు, చంద్రగిరి శ్రీనివాసరావు, సలిగంటి శ్రీనివాస్, చంద్ర నరేంద్ర కుమార్, మండలాల కార్యదర్శులు గుండెపిన్ని వెంకటేశ్వరరావు, వాసిరెడ్డి మురళి, భూక్యా దస్రు, బొర్రా కేశవరావు, జిల్లా సమితి సభ్యులు కంచర్ల జమలయ్య, కందుల భాస్కర్, జి వీరాస్వామి, కొమారి హన్మంతరావు, జక్కుల రాములు, కె రత్నకుమారి, మాతంగి లింగయ్య, పాపారావు తదితరులు పాల్గొన్నారు.

# వాసుపల్లి చొరవతో వృద్ధురాలికి ఆశ్రయం

**39 వ వార్డు అధ్యక్షుడు ముజీబ్ ఖాన్ సహకారంతో ఆశ్రమంలో చేరిక**



సి కే న్యూస్ విశాఖపట్నం ప్రతినిధి ( రవికుమార్ ) ఏప్రిల్ 26 : దక్షిణ నియోజకవర్గం మాజీ ఎమ్మెల్యే, వైయస్ఆర్సీపీ సమన్వయకర్త వాసుపల్లి గణేష్ కుమార్ సహకారంతో తన వద్దకు సాయం కోసం వచ్చిన ఓ వృద్ధురాలికి ఆశ్రయం కల్పించారు. ఆశిలమెట్ట కార్యాలయం సమీపంలో అనాధగా జీవిస్తున్న వృద్ధురాలు పట్టడన్నం కూడా దొరకని స్థితిలో ఉంటూ వాసుపల్లి సహకారం కోరింది. తక్షణమే స్పందించిన వాసుపల్లి గణేష్ కుమార్ 39 వ వార్డు వైసిపి అధ్యక్షుడు ముజీబ్ ఖాన్ తో వృద్ధురాలిని వన్ టౌన్ ప్రాంతంలో ఉన్న శ్రీ స్వామి వివేకానంద స్వచ్ఛంద సేవా సంస్థలో ఆశ్రయం కల్పించారు. టు వీలర్ పై స్వయంగా తీసుకువెళ్లి ఆశ్రయం ప్రతినిధులకు అప్పగించారు. దక్షిణ నియోజకవర్గంలో పేదలకే కాకుండా అనాధలకు కూడా అండగా నిలబడే వాసుపల్లి గణేష్ కుమార్ సేవలపట్ల పలువురు ప్రశంసిస్తున్నారు.

# ఆకతాయి ఆటో డ్రైవర్ కి అడ్డుకట్ట వేసిన పోలీసులు

**విచ్చలవిడిగా ఆటోల్లో డీజే బాక్సులతో శబ్ద కాలుష్యం యూనిఫాంలో కూడా లేకుండా కాలేజీల వద్ద కాపలా**

సి కే న్యూస్ విశాఖపట్నం ప్రతినిధి ( రవికుమార్ ) ఏప్రిల్ 26 : రెండో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో జీవీఎంసీ గాంధీ పార్కు సమీపంలో ఓ ఆకతాయి ఆటో డ్రైవర్ డీజే బాక్సులతో భారీసౌండ్ పెట్టుకునీ భయం కరమైన శబ్దాలతో బెంబేలెత్తిస్తుండగా అక్కడే ఉన్న రెండో పట్టణ ట్రాఫిక్ కానిస్టేబుల్ కొరడా జులిపించారు. ఎంత చెప్పినప్పటికీ కనీసం ఆటో తాళాలు కూడా ఇవ్వకుండా ఆటో డ్రైవర్ మొండిపట్టు పట్టాడు. అక్కడి ఆకతాయి ఆటో డ్రైవర్ కు కనీసం ఆటో యూనిఫామ్ కూడా లేదు కదా.. ఆయనకు తోడుగా మరో 10 మంది అక్కడి అల్లరి చిల్లరగా ఆటోలు నడుపుతున్న యువత మూకుమ్మడిగా చేరి టూ టౌన్ ట్రాఫిక్ పోలీసులతో వాగ్వాదానికి దిగడం శోచనియం. చివరికి ట్రాఫిక్ కానిస్టేబుల్ రికవరీ వ్యాన్ కి ఫోన్ చేసి మరో ఇద్దరు కానిస్టేబుల్ సహాయంతో ఆటోను స్టేషన్ కు తరలించారు. ఇలాంటి వారిపై పోలీస్ కమిషనర్ ఇప్పటికే చర్యలు



తీసుకోవాలని ఆదేశాలు జారీ చేసినప్పటికీ నిజంగా పొట్టకూటికోసం ఆటో వేస్తున్న కొంతమంది డ్రైవర్లకు ఇలాంటి చిల్లర యువత ఆటో డ్రైవర్లు రోడ్డు ప్రమాదాలకు పలు ఆసాంఘిక కార్యక్రమాలకు తలనొప్పిగా మారుతున్నారు. ఆటోలో భారీ సౌండ్ పెట్టుకుని, రోడ్డుకు అడ్డదారుల్లో ఇష్టం వచ్చి నట్టుగా డ్రైవింగ్లు చేస్తున్న ఇటువంటివారిని లైసెన్సుల్ రద్దుచేసి, ఆటోలు సీజ్ చేయాలని పలువురు కోరుతున్నారు.

# సెలవులకు ఊరెళ్తున్నారా.. జరభద్రం!

- ఇండ్లకు తాళాలు వేసి దూర ప్రయాణాలు చేసేవారు పోలీస్ వారికి సమాచారం అందించండి.
- ఎస్పీ రోహిత్ రాజు.

సీ కే న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, ( సాయి కౌశిక్),ఏప్రిల్ 26,వేసవి కాలం సెలవులు ప్రారంభంతో చాలా మంది ప్రయాణాలు చేస్తారు. ఇదే అదనుగా దొంగలు చేతివాటం ప్రదర్శిస్తారు. ఇంటిని వదిలి దూర ప్రయాణాలు చేసే వారు అప్రమత్తంగా ఉండాలని, ముందస్తుగా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఐపిఎస్ అన్నారు. వేసవి సెలవుల దృష్ట్యా చోరీల నియంత్రణకు అన్ని చర్యలు చేపట్టామని, ప్రజలను అప్రమత్తం చేస్తున్నామన్నారు. రాత్రి వేళల్లో వీధుల్లో గస్తీని ముమ్మరం చేస్తున్నామన్నారు. ఈ విషయంలో జిల్లా పరిధిలోని ప్రజలు కూడా జాగ్రత్తలు తీసుకోవాలని ప్రజలకు అయన పలు సూచనలు చేశారు. దూర ప్రాంతాలకు వెళ్లేవారు తమ ఇంటి చిరునామా, ఫోన్ నెంబర్‌ను సంబంధిత పోలీసు స్టేషన్ అధికారులకు తెలపాలి. దీంతో వారి వివరాలను రిజిస్టర్‌లో నమోదు చేసుకుని ఊర్లెళ్లిన వారి ఇండ్ల పరిసర ప్రాంతాల్లో నిఘాను ఏర్పాటు చేస్తామని తెలిపారు. మీరు ఇంట్లో లేని సమయంలో మీ ఇంటిని గమనిస్తూ ఉండమని మీ ఇంటి దగ్గర గల మీకు నమ్మకమైన ఇరుగు పొరుగు వాళ్ళకు చెప్పడం మంచిదన్నారు. విలువైన వస్తువుల




సమాచారాన్ని, వ్యక్తిగత ఆర్థిక విషయాలను ఇతరులకు చెప్పకూడదు. ఇంట్లో బంగారు నగలు, నగదు ఉంటే వాటిని బ్యాంకు లాకర్లలో భద్రపరుచుకోవడం క్షేమం. లేదా ఎక్కువ రోజులు ఊళ్లకు వెళ్లేవారు విలువైన వస్తువులను తమ వెంట తీసుకెళ్లాలి. బ్యాగుల్లో బంగారు నగలు, డబ్బు పెట్టుకొని ప్రయాణం చేస్తున్నప్పుడు బ్యాగులు దగ్గర పెట్టుకోవాలని సూచించారు. ప్రజలు నిరంతరం పోలీసులతో సమన్వయంగా సహకరిస్తే చోరీలను నియంత్రించడం చాలా సులభం. కాలనీల్లో దొంగతనాల నివారణకు స్వచ్ఛందంగా సీసి కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి. ఎప్పటికప్పుడు పోలీసులకు అందుబాటులో ఉంటూ అనుమానాస్పద, కొత్త వ్యక్తుల కదలికలపై డయల్ 100 నకు ఫోన్ చేసి సమాచారం అందించాలి.

# కాశ్మీర్ లో జరిగిన ఉగ్రవాద దాడిలో ప్రాణాలు కోల్పోయిన వారికి ఘన నివాళులు



సి కే న్యూస్ విశాఖపట్నం ప్రతినిధి ( రవికుమార్ ) ఏప్రిల్ 26 : జమ్మూ కాశ్మీర్ లోని బైసరన్ ప్రాంతంలో పర్యాటకలపై ఉగ్రవాదులు దాడి చేసి కొంతమందిని హతమార్చారు. జరిగిన ఈ దుశ్చర్యను తీవ్రంగా ఖండిస్తూ, మృతులకు శ్రీ స్వామి వివేకానంద సంస్థ వారు ఘనంగా నివాళు లర్పించారు, వివేకానంద సంస్థ గౌరవ అధ్యక్షులు డాక్టర్.సి ఎం ఏ జహీర్ అహ్మద్ , ఉమ్మడి రాష్ట్రాల రౌండ్ టేబుల్ సంస్థ చైర్మన్ మక్సుద్ అహ్మద్ ఉగ్రవాదుల దాడిలో మృతి చెందిన కుటుంబ సభ్యులకు సంతాపం తెలియజేస్తూ, కాగడాలు వెలిగించి నివాళులర్పిస్తూ, కాగడాలతో, జాతీయ జెండాలతో ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఉగ్రవాద దాడిని ఖండించాలని ముక్తకంఠంతో డాక్టర్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సంస్థ అధ్యక్షులు అప్పారావు, సంస్థ సభ్యులు మరియు ట్యూషన్ విద్యార్థులు పాల్గొన్నారు.

# జీవీఎంసీ డిప్యూటీ మేయర్ పై అవిశ్వాసం తీర్మానానికి 74 మంది సభ్యుల మద్దతు

**విశాఖ జిల్లా కలెక్టర్, ప్రెసైడింగ్ అధికారి ఎంఎన్.హరేంధిర ప్రసాద్**



సి కే న్యూస్ విశాఖపట్నం ప్రతినిధి ( రవికుమార్ ) ఏప్రిల్ 26 : మహా విశాఖపట్నం నగరపాలక సంస్థ డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ పై ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానానికి 74 మంది సభ్యులు మద్దతు తెలిపారని విశాఖ జిల్లా కలెక్టర్ మరియు ప్రెసైడింగ్ అధికారి ఎంఎన్.హరేంధిర ప్రసాద్ తెలిపారు. శనివారం జీవీఎంసీ ప్రధాన కార్యాలయం కౌన్సిల్ సమావేశం మందిరంలో డిప్యూటీ మేయర్ పై ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానంపై కౌన్సిల్ సమావేశం నిర్వహించారు.

ఈ సమావేశంలో విశాఖ జిల్లా కలెక్టర్ మరియు ప్రెసైడింగ్ అధికారి మాట్లాడుతూ జీవీఎంసీ డిప్యూటీ మేయర్ పై జీవీఎంసీ కౌన్సిల్ సభ్యులు ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానం సమావేశానికి జీవీఎంసీ కౌన్సిల్ సభ్యులు 63 మంది హాజరయ్యారని, ఎక్స్ అఫీషియో సభ్యులైన పార్లమెంటు సభ్యులు, శాసనసభ్యులు, శాసనమండలి సభ్యులు 11 మంది తో కలిపి మొత్తం 74 మంది సభ్యులు హాజరయ్యారన్నారు, ఈ సమావేశంలో అవిశ్వాస తీర్మానానికి కోరం సరిపోయినందున అవిశ్వాస తీర్మానాన్ని ప్రవేశపెట్టడమైనదని, 74 మంది సభ్యులు అవిశ్వాసానికి వారి మద్దతును తెలిపారన్నారు. ఎవరు కూడా ప్రతిపాదననకు వ్యతిరేకంగా గాని, తటస్థంగా గానీ లేరన్నారు. ఈ అవిశ్వాస తీర్మానం పై వచ్చిన మద్దతును అంగీకరించి, తీర్మాణం ఆమోదిండమైనదని, తదుపరి చర్య కొరకు ప్రభుత్వానికి నివేదికను సమర్పిస్తామని కలెక్టర్ తెలిపారు.

# సంక్షేమ పథకాలను సమర్థవంతంగా అమలుపరచాలి.

- జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్.




**సీ కే న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, ( సాయి కౌశిక్),ఏప్రిల్ 26,** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ఇందిరమ్మ ఇండ్లు, రాజీవ్ యువ వికాసం, భూభారతి చట్టం లను సమర్థవంతంగా అమలు పరచాలి అని జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ అన్నారు. శనివారం ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులు ఎంపిక, రాజీవ్ యువ వికాసం దరఖాస్తుల పరిశీలన, భూభారతి చట్టం, జలసంచై జన్ భాగి దారి కార్యక్రమంలో భాగంగా ఇంకుడు గుంతలు మరియు పాము పౌండ్స్ నిర్మాణం మరియు త్రాగునీటి సమస్యల పరిష్కారం పై సంబంధిత అధికారులతో టెలీ కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల పరిశీలన వేగవంతం చేయాలన్నారు. ప్రతి నియోజకవర్గంలో 3500 ఇండ్లకు గాను ఇప్పటికే మొదటి విడతలో మండలానికి ఒక గ్రామ పంచాయతీ ఎంపిక చేసి ఉన్నారని మిగిలిన గ్రామ పంచాయతీలలో లబ్ధిదారుల అర్హుల జాబితా క్షేత్రస్థాయిలో పర్యటించి త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. నియోజకవర్గ ప్రత్యేక అధికారులు తమ వద్దకు వచ్చిన జాబితాను సంబంధిత మండలాల ఎంపీడీవోలు లేదా మున్సిపల్ కమిషనర్ల కు అందజేసి వారు స్థానికంగా ఉన్న ఇందిరమ్మ ఇండ్ల కమిటీ సభ్యులు మరియు పంచాయతీ సెక్రటరీల తో సమన్వయం పరచుకొని ఉన్న జాబితాలో పేదల్లో నిరుపేద వారిని గుర్తించి అర్హుల జాబితా రూపొందించాలన్నారు. జాబితాలో పేరు లేని ఎవరైనా నిరుపేదలు ఉంటే వారి పేర్లు కూడా జత పరిచి అర్హుల జాబితా తయారు చేసి స్థానిక శాసనసభ్యులు సహకారంతో జాబితా రూపొందించాలని అన్నారు.

జిల్లా వ్యాప్తంగా రాజీవ్ యువ వికాసం పథకం లో భాగంగా వచ్చిన దరఖాస్తులన్నీ త్వరితగతిన పరిశీలన చేపట్టి అర్హుల జాబితా రూపొందించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. వచ్చిన దరఖాస్తులను ఆయా కార్పొరేషన్ల వారీగా క్షేత్రస్థాయి లో బ్యాంకర్లతో కలిసి పరిశీలించి అర్హుల జాబితా రూపొందించాలని అన్నారు. రాజీవ్ యువ వికాసాని కి దరఖాస్తు చేసుకున్న వారికి వ్యవసాయ ఆధారిత యూనిట్లు స్థాపన చేసేలా అవగాహన కల్పించాలన్నారు. భూమి ఉన్నవారికి ఆయిల్ పంపు, పందుల పెంపకం, పాడి పరిశ్రమ, పవర్ లోడర్ వంటివి భూమి లేని వారికి చేపల పెంపకం, పుట్టగొడుగుల పెంపకం, పిండి మిల్లు వంటి యూనిట్లు స్థాపించడం ద్వారా వారికి లాభదాయకంగా ఉంటుందని తెలియచెప్పాలన్నారు. జల్ సెంచెయ్ జన్ భాగీ దారి కార్యక్రమం లో భాగంగా జిల్లావ్యాప్తంగా విస్తృతంగా ఇంకుడు గుంతలు, ఫామ్ పౌండ్స్ నిర్మాణాలు చేపట్టే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. చేపట్టిన నిర్మాణాలను ఆన్లైన్లో నమోదు చేయాలని ఆదేశించారు.

భూ సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న భూభారతి జిల్లాలో అమలులో భాగంగా రెవెన్యూ రికార్డులను సరిదిద్దాలని అధికారులను ఆదేశించారు. నాన్ డిఎస్ కారణాలను గుర్తించి వాటిని పరిష్కరించాలని ఆదేశించారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న పెండింగ్ భూ సమస్యల దరఖాస్తులను నివేదిక అందించాలని ఆదేశించారు. అదేవిధంగా రెవెన్యూ అధికారులు తమ పరిధిలో ఉన్నటువంటి రేషన్ కార్డ్ దరఖాస్తులు పరిశీలన మరియు ఎన్నికల దరఖాస్తుల పరిశీలన త్వరితగతిని పూర్తిచేయాలని ఆదేశించారు.

జిల్లా వ్యాప్తంగా త్రాగునీటి సమస్య ల పరిష్కారానికి కావలసిన అన్ని చర్యలు తీసుకోవాలని మిషన్ భగీరథ అధికారులను ఆదేశించారు. పైప్ లైన్ లో లీకేజీ మరియు పంపుల మరమ్మత్తులు ప్రాతిపదిక మీద పూర్తిచేయాలని ఆదేశించారు. త్రాగునీటి సరఫరా లో ఇబ్బందులు ఉన్నచోట ట్యాంకర్లు తో ప్రజలకు త్రాగునీటి ఇబ్బందులు కలగకుండా సరఫరా చేయాలనే ఆదేశించారు. జిల్లాలో ఎక్కడ త్రాగునీటి సమస్య తలెత్తిన వెంటనే మిషన్ భగీరథ అధికారులు దృష్టికి తీసుకురావాలని వాటిని తక్షణమే వారు పరిష్కరించాలని ఆదేశించారు.

## చరిత్రలో నిలిచిపోనున్న సభ.

- వనమా రాఘవ.
- మాజీ మంత్రి వనమా నాయకత్వంలో భారీగా రానున్న నాయకులు కార్యకర్తలు



**సీ కే న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, ( సాయి కౌశిక్),ఏప్రిల్ 26,**ఏప్రిల్ 27 న చలో వరంగల్ ఎల్కతుర్తి రజతోత్సవ సభకు కొత్తగూడెం నియోజకవర్గం నుండి బిఆర్ఎస్ నాయకులు కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని సభను జయప్రదం చేయాలని బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు మాజీ మంత్రి వనమా వెంకటేశ్వరరావు కుమారుడు వనమా రాఘవేంద్రరావు అన్నారు.

సభకు హాజరయ్యే ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు జరుగుతున్నాయని సభ ప్రాంగణం దగ్గర జరుగుతున్నా ఏర్పాట్లను సభా ప్రాంగణానికి శుక్రవారం వెళ్లి పరిశీలించటం జరిగింది అని ఎవరికీ ఇబ్బంది లేకుండా బిఆర్ఎస్ పార్టీ నాయకత్వం ఏర్పాట్లు చేస్తుంది అని అన్నారు. ఆదివారం ఏప్రిల్ 27వ తేదీన వరంగల్ లోని ఎలుకతుర్తి ప్రాంతంలో జరగనున్న సభ బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు, తెలంగాణ బాపు తొలి ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర రావు ఆధ్వర్యంలో జరుగుతున్న పార్టీ రజితోత్సవ బహిరంగ సభకు కొత్తగూడెం నియోజకవర్గం వ్యాప్తంగా అత్యధిక సంఖ్యలో బిఆర్ఎస్ కార్యకర్తలు, అభిమానులు ప్రజలు అధిక సంఖ్యలో తరలిరావాలని 10 లక్షల మంది జనంతో 1250 ఎకరాల స్థలంలో 1000 ఎకరాల పార్కింగ్ స్థలం 250 ఎకరాల సభ ప్రాంగణం..
02 వేల మంది పోలీసులు 2 వేల మంది ప్రైవేట్ సెక్యూరిటీ. 4 వేల బలగాలతో బందోబస్తు నడుమ
10 లక్షల వాటర్ బాటిళ్లు. 10 లక్షల మజ్జిగ ప్యాకెట్లు..
50 మెడికల్ క్యాంపులు. 10 అంబులెన్సులు. 200 ల జనరేటర్లు. 200 ల సీసీ కెమెరాలు.. 500 ల టాయిలెట్స్..
50 క్రేన్లు.. 50 పెట్రోలింగ్ వాహనాలతో భారీ ఏర్పాట్లు చేస్తున్నారు కావున లక్షలాదిగా కదులుదాం
తెలంగాణ సత్తా చాటుదాం అని ప్రతి ఒక్క కార్యకర్త ఆదివారం ఉదయం ఇల్లందు క్రాస్ రోడ్డు వద్దకు అధిక సంఖ్యలో పాల్గొనాలని వనమా రాఘవ పిలుపునిచ్చారు

## పాల్వంచ మున్సిపాలిటీలో వృదాగ పోతున్న నీరు.

- పట్టించుకోని మున్సిపాలిటీ అధికారులు.
- ఫోన్లు చేసిన స్పందించని మున్సిపాలిటీ అధికారులు.
- సమస్యలు ఎవరికి చెప్పుకోవాలో అర్థం కాక సతమతమవుతున్న పాల్వంచ పట్టణ ప్రజలు.
- కలెక్టర్ ఆదేశాలు పాల్వంచ మున్సిపాలిటీ అధికారులకు పట్టవా.



**సీ కే న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, ( సాయి కౌశిక్),ఏప్రిల్ 26,**పాల్వంచ మున్సిపాలిటీలో పలుచోట్ల పైపులైన్లు పలిగి నీరు వృధాగా పోతున్నా మున్సిపాలిటీ అధికారులు పట్టించుకోవడం లేదు. కనీసం సమాచారం ఇవ్వడానికి ప్రజలు ఫోన్లు చేసినా మున్సిపాలిటీ అధికారులు కనీసం ఫోన్లు లిఫ్ట్ చేయని పరిస్థితి నెలకొంది. అసలే ఎండాకాలం, ఎండలు మండుతున్నాయి. నీటి ఎద్దడి ఏర్పడే అవకాశం ఉన్నప్పటికీ కనీసం మున్సిపాలిటీ అధికారులు చూసి చూడనట్టు వ్యవహరించడంపై పాల్వంచ పట్టణ ప్రజలు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు. మున్సిపాలిటీలోని కొన్ని కాలనీలో ఇంకా అరకొరగా వారానికి ఒకసారి మంచినీళ్లు ఇస్తున్న పరిస్థితి ఉన్నప్పటికీ. రోడ్లపై మాత్రం నీళ్లు ఏరులై వృధా పోతున్నా, అటువైపుగా చూడలేనంత బిజీ అయిపోయారు మున్సిపాలిటీ అధికారులు. మరోపక్క పైపుపు పలిగి డ్రైనేజి నీళ్లు వస్తున్నాయని వనమా కాలనీ నుండి జయమ్మ కాలనీ మధ్యలో మంచినీళ్ల పైపు పగిలి నీటి కలుషితం అవుతుందని. రోగాల బారిన పడుతున్నామని. గత రెండు నెలలక్రితం. ఆ కాలనీ ప్రజలు మున్సిపాలిటీ ఏఈ గారికి ఫిర్యాదు చేసినప్పటికీ కనీసం పట్టించుకున్న పాపను పోలేదని అంటున్నారు. ఎందుకింత నిర్లక్ష్యంగా అధికారులు వ్యవహరిస్తున్నారు అర్థం కాని పరిస్థితి నెలకొందిని ప్రజలు మాట్లాడుకుంటున్నారు.

పట్టణాలు పల్లెల్లో నీటి కొరత లేకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఆదేశాలు ఉన్నప్పటికీ అధికారులు మాత్రం నిమ్మకు నేర్తనట్లుగా వ్యవహరిస్తున్నారని. ప్రజలు బహుటంగా చర్చించుకుంటున్నారు.

ఇప్పటికైనా మున్సిపాలిటీ అధికారులు స్పందించి పట్టణంలోని పలు ప్రాంతాలలో పైపులు పలిగి వృధాగా పోతున్న నీటిని అరికట్టాలని ప్రజలకు మంచినీటిని అందించాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు....

## ఎమ్మెల్యే గారి సౌజన్యంతో 8 లక్షల రూపాయల ఎల్ఓసి చెక్కు అందజేత.

**సి కె న్యూస్ వలిగొండ మండలం ప్రతినిధి బాలరాజు ఏప్రిల్ 26.** యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండల పరిధిలోని వేములకొండ గ్రామానికి చెందిన గూడెల్లి నరేష్ కుమార్తె అనారోగ్యము వలన చాలా రోజుల నుండి ఇబ్బందికి గురి అవుతున్నారు, సరైన ట్రీట్మెంట్ కోసం స్థానిక ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి సౌజన్యంతో ఎనిమిది లక్షల రూపాయల ఎల్ వో సి ,కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు మండల కో ఆప్షన్ సభ్యులు ఎస్.కె రసూల్, సీనియర్ నాయకులు పులిపలుపుల రాములు గౌడ్, ఆధ్వర్యంలో, ఇ,ఎన్, టి హాస్పిటల్ లో ట్రీట్మెంట్ కోసం 8 లక్షల రూపాయల ఎల్ఓసి గూడేల్లి నరేష్ కుటుంబ సభ్యులకు ఎమ్మెల్యే గారు అందజేసినారు.



## కేజీహెచ్ కు విచ్చేసిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కి ఘన స్వాగతం పలికిన ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్

**సి కే న్యూస్ విశాఖపట్నం ప్రతినిధి ( రవికుమార్ ) ఏప్రిల్ 26 :** కేజీహెచ్ లో ఆంధ్ర వైద్య కళాశాలలో పూర్వ విద్యార్థుల ఆధ్వర్యంలో నిర్మించిన శతాబ్ది భవనాన్ని రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్ర బాబునాయుడు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే వంశీకృష్ణ ముందుగా హెలిప్యాడ్ వద్ద సీఎం కి ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ సీఎం తో సమావేశంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర మంత్రులు, ఎంపీ లు, ఎమ్మెల్యే లు, అధికారులు, ఇతర ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.



## పెద్దమ్మగుడిలో ఘనంగా "రుద్రహోమం".



**సీ కే న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, ( సాయి కౌశిక్),ఏప్రిల్ 26,**మాసశివ రాత్రిని పురస్కరించుకొని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, పాల్వంచ మండలం, కేశవాపురం-జగన్నాధపురం గ్రామంలో వెలసియున్న శ్రీ కనకదుర్గ దేవస్థానము (పెద్దమ్మ గుడి)లో దేవస్థాన కార్యనిర్వహణాధికారి ఎన్. రజనీకుమారి ఆదేశాల మేరకు "రుద్రహోమం" శనివారం ఆలయ ఆవరణ లోని యాగశాలలో నిర్వహించబడినది. ముందుగా మేళతాళాలతో, వేదమంత్రాలతో అమ్మవారి, స్వామివారి ఉత్సవమూర్తులను దేవాలయం నుండి యాగశాలకు తీసుకొనివచ్చి మండపారాధన, గణపతి పూజలు తదితర పూజలు జరిపి అనంతరం రుద్రహోమం నిర్వహించి చివరన పూర్ణాహుతి కార్యక్రమం నిర్వహించబడినది. ఇట్టి రుద్రహోమంలో ముగ్గురు (3) దంపతులు పాల్గొన్నారు. అనంతరం రుద్రహోమంలో పాల్గొన్న దంపతులకు అర్చకులు ఆశీర్వచనంతో పాటు శేషవస్త్రప్రసాదము అందచేశారు. ఈ కార్యక్రమంలో భక్తులు, అర్చకులు, సిబ్బంది. పాల్గొన్నారు.

"శనిత్రయోదశి సందర్భంగా ఆలయంలో శనిశ్వరునికి తైలాభిషేకం""శనిత్రయోదశి" సందర్భంగా ఈ రోజు ఉదయం "శనిశ్వరుడిని తైలాభిషేకం" దేవస్థాన అర్చకులచే నిర్వహించబడినవి.

## ఉగ్రవాదం చేసే వాళ్లపై ఉక్కు పాదం మోపుదాం.

- మండల కోఆప్షన్ నెంబర్ ఎస్.కె రసూల్ వేములకొండ గ్రామం.



**సి కె న్యూస్ వలిగొండ మండలం ప్రతినిధి బాలరాజు మండలం ఏప్రిల్ 26.**పహల్గామ్ మారణకాండను కోఆప్షన్ నెంబర్ ఎస్కే రసూల్ ఖండించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.

అమాయక పౌరుల మృతి పట్ల సంతాపం ప్రకటిస్తూ వారి కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు. దేశంలో ఇలాంటి ఘటనలు జరగటం వాంఛనీయం కాదని పేర్కొన్నారు. ఉగ్రవాదులకు మతం ఉండదని అకారణంగా తోటి మానవులను చంపటం మానవత్వం కాదని వాళ్లు మనుషులు కాదని మృగాల కన్నా దారుణంగా ప్రవర్తించారాని విమర్శించారు,ఇలాంటి ఉగ్రవాదులను బహిరంగంగా ఉరితీయాలని పిలుపునిచ్చారు,ఇలాంటి సమయంలో మేధావులు ప్రజాస్వామ్యవాదులు ప్రతి ఒక్కరూ శాంతి సామరస్యం కోసం పాటుపడాలని విజ్ఞప్తి చేశారు,మృతుల కుటుంబాలకు సంపూర్తిగా న్యాయం చేకూర్చాలని కోరారు.

## ఎమ్మెల్యే గారి సౌజన్యంతో 8 లక్షల రూపాయల ఎల్ఓసి చెక్కు అందజేత.



**సి కె న్యూస్ వలిగొండ మండలం ప్రతినిధి బాలరాజు మండలం ఏప్రిల్ 26.** యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండల పరిధిలోని వేములకొండ గ్రామానికి చెందిన గూడెల్లి నరేష్ కుమార్తె చెవి ముక్కు పనిచేయక చాలా రోజుల నుండి ఇబ్బందికి గురి అవుతున్నారు, సరైన ట్రీట్మెంట్ కోసం స్థానిక ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి సౌజన్యంతో ఎనిమిది లక్షల రూపాయల ఎల్ వో సి చెక్కును,కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు మండల కో ఆప్షన్ సభ్యులు ఎస్.కె రసూల్, సీనియర్ నాయకులు పులిపలుపుల రాములు గౌడ్, ఆధ్వర్యంలో, ఇ,ఎన్, టి హాస్పిటల్ లో ట్రీట్మెంట్ కోసం 8 లక్షల రూపాయల చెక్కును గూడేల్లి నరేష్ కుటుంబ సభ్యులకు ఎమ్మెల్యే గారు అందజేసినారు.

## వరంగల్ లో జరిగే 25వ రాజతోత్సవ ఉత్సవం దిగ్విజయం చేయాలి.



**సి కె న్యూస్ మండలం ప్రతినిధి బాలరాజు ఏప్రిల్ 25.**రాజతోత్సవ సభకు భారీగా తరలి. రావాలే.... దేగల
రేపు వరంగల్ ఎల్కతుర్తిలో బీ ఆర్. ఎస్. పార్టీ నిర్వహించే 25 వసంతాల రాజతోత్సవ సభను భువనగిరి నియోజకవర్గం నుండి బీ ఆర్ ఎస్. పార్టీ. సైనికులు కేసీఆర్. గారి మరియు మాజీ ఏం ఎల్ ఏ పైళ్ల శేఖర్ రెడ్డి . అభిమానులు భారీ ఎత్తున తరలి వెళ్లి సభను. విజయవంతం చేయాలని వలిగొండ మండల పార్టీ మాజీ అధ్యక్షులు దేగల పాండు యాదవ్ పిలుపునిచ్చారు

## పద్మశ్రీ అవార్డు గ్రహీత మందకృష్ణ మాదిగ మే 2 న , జరుగు సన్మాన కార్యక్రమం విజయవంతం చేయాలి.

- జేరిపోతుల సుధాకర్ మాదిగ
- ఎమ్మార్పీఎస్ మండల ఇంచార్జీ



**సీకే న్యూస్ ఏప్రిల్ 26 శనివారం హనుమకొండ జిల్లా ధర్మసాగర్ మండలం ప్రతినిధి కమలాకర్:** ధర్మసాగర్ మండల కేంద్రంలో ఎమ్మార్పీఎస్ ఎం ఎస్ పి అనుబంధ విభాగాల ముఖ్య కార్యకర్తల సమావేశం ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షులు సోంపల్లి అన్వేష్ మాదిగ ఆధ్వర్యంలో నిర్వహించగా ,ఎమ్మార్పీఎస్ మండల ఇన్చార్జి జేరిపోతుల సుధాకర్ మాదిగ ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడుతూ,మూడు దశాబ్దాల అలుపెరగని సామాజిక ఉద్యమ నిర్మాతగా వర్గీకరణ విజయ ఫలాలు జాతికి అందించి చిరస్మరణీయుడిగా నిలిచిన పీడిత వర్గాల ఆత్మగౌరవ, హక్కుల ఉద్యమ ప్రతీక మందకృష్ణ మాదిగ కి దేశ అత్యున్నత పౌర పురస్కారమైన పద్మశ్రీ అవార్డు రావడం, అలాగే మూడు దశాబ్దాల ఉద్యమ చిరకాల ఆకాంక్ష అయిన వర్గీకరణ నెరవేరడంతో ఆ మహనీయున్ని మే నెల 2వ వారంలో స్టేషన్ గణపూర్ లో జరుగు సన్మాన కార్యక్రమాన్ని ఘనంగా సత్కరించుకొని జాతి చైతన్య స్ఫూర్తిని ఆ సభతో పొందాలని అన్నారు.
ధర్మసాగర్ మండల పరిధిలో ఉన్న ప్రతి గ్రామాన్ని, ప్రతి హృదయాన్ని తట్టి లేపేలా అన్ని రాజకీయ పక్షాలను మాదిగ జాతి నాయకులను, ఉద్యమ సంఘాలను ఏకం చేసి ఐక్యంగా ఆ సన్మాన సభ విజయవంతం కోసం కృషి చేయాలని కోరారు. జాతి అధినేతకు అన్ని పక్షాలు ఏకమై ఘన సన్మానం చేసేలా మన అస్తిత్వాన్ని ఆత్మ గౌరవాన్ని నిలబెట్టుకునేలా శ్రమించాలని జాతి చైతన్యం మీదనే మన వర్గాల భవిష్యత్తు ఆధారపడి ఉన్నదని అందుకు అందరిని కలుపుకొని ముందుకు నడవాలని పిలుపునిచ్చారు.
కార్యక్రమంలో ఎంఎస్పి జిల్లా అధికార ప్రతినిధి గంగారపు శ్రీనివాస్ మాదిగ, ఎమ్మార్పీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి బొడ్డు శాంతి సాగర్ మాదిగ, విహెచ్పిఎస్ మండల అధ్యక్షులు మాచర్ల బాబు, ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకులు పుట్ట ప్రశాంత్ మాదిగ, ఎమ్మార్పీఎస్ మండల ప్రధాన కార్యదర్శి చిలుక రాజు మాదిగ, ఎమ్మార్పీఎస్ మండల నాయకులు
బొడ్డు ప్రణయ్ మాదిగ, నక్క రమేష్ మాదిగ, చిలుక అభిలాష్ మాదిగ, గంగారపు సత్యం మాదిగ, గంగారపు కిష్టఫర్ మాదిగ, మాచర్ల సంపత్ మాదిగ, చింత అరవింద్ మాదిగ, కొట్టే వినయ్ మాదిగ, మాచర్ల మనోజ్ మాదిగ, మాచర్ల మున్నా మాదిగ, తదితరులు పాల్గొన్నారు.

## మేయర్ ఎన్నికకు సర్వం సిద్ధం చేయండి

విశాఖ జిల్లా జాయింట్ కలెక్టర్ మరియు ఎన్నికల ప్రెసైడింగ్ అధికారి మయూరి అశోక్



**సి కే న్యూస్ విశాఖపట్నం ప్రతినిధి ( రవికుమార్ ) ఏప్రిల్ 26 :** మహా విశాఖపట్నం నగరపాలక సంస్థ మేయర్ ఎన్నిక కొరకు చేస్తున్న ఏర్పాట్లలోఎటువంటి లోపాలు లేకుండా సర్వం సిద్ధం చేయాలని విశాఖ జిల్లా జాయింట్ కలెక్టర్ మరియు ఎన్నికల ప్రెసైడింగ్ అధికారి మయూరి అశోక్ జివిఎంసి అధికారులను ఆదేశించారు. శనివారం ఆయన జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలోని కౌన్సిల్ హాల్ ను సందర్శించి ఏప్రిల్ 28వ తేదీన జరుపబోవు మేయర్ ఎన్నిక కు చేపడుతున్న ఏర్పాట్లను, తీసుకుంటున్న జాగ్రత్తల పై అధికారులను అడిగి తెలుసుకుని పలు సూచనలు చేశారు ఈ సందర్భంగా జిల్లా జాయింట్ కలెక్టర్ మరియు ఎన్నికల ప్రెసైడింగ్ అధికారి మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఎలక్షన్ కమిషన్ జారీ చేసిన నోటిఫికేషన్ మేరకు మహా విశాఖపట్నం నగరపాలక సంస్థ మేయర్ ఎన్నిక ను ఏప్రిల్ 28వ ఉదయం 11 గంటలకు జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలో కౌన్సిల్ సమావేశం మందిరంలో ప్రత్యేక సమావేశం నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఈ ఎన్నిక కు తీసుకోవలసిన జాగ్రత్తలపై అధికారులకు వివరిస్తూ మేయర్ ఎన్నిక ప్రత్యేక సమావేశమునకు కౌన్సిల్ సభ్యులు , ఎక్స్ అఫీషియో సభ్యులు ఉదయం 10:30 నిమిషాలకు తమ గుర్తింపు కార్డులతో హాజరు కావాలని, ఇతరులను ఎవరినీ కూడా సమావేశంలోనికి అనుమతించబడరని తెలిపారు. సభ్యులు తమ మొబైల్ ఫోన్ లను ఫ్లైట్ మోడ్ లో పెట్టుకోవాలని సూచించారు. మేయర్ ఎన్నికకు సంబంధించిన జీవీఎంసీ అధికారిక లైవ్ టెలికాస్ట్ లింకు అందుబాటులో ఉంచుతామన్నారు . ఎన్నిక సోమవారం జరుగబోతున్నందున ఆరోజున జీవీఎంసీలో ఫ్రీ వెహికిల్ జోన్ అయినప్పటికీ సభ్యులు, అధికారుల వాహనాలను భద్రతా ఏర్పాట్ల దృష్ట్యా జీవీఎంసీ లోనికి అనుమతించడం జరుగునని ప్రిసైడింగ్ అధికారి తెలిపారు.
ఈ కార్యక్రమంలో జీవీఎంసీ అదనపు కమిషనర్లు డి.వి. రమణమూర్తి ,ఎస్.ఎస్. వర్మ , కార్యదర్శి బి.వి.రమణ, అడ్మినిస్ట్రేటివ్ అధికారి పి.పద్మజ, ఆఫీస్ ఇంచార్జ్ ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

## ఉచిత స్పోకెన్ ఇంగ్లీష్ తరగతుల నిర్వహణ



**సి కే న్యూస్ ఇల్లందు నియోజకవర్గ ప్రతినిధి, ( వెంకటేష్),ఏప్రిల్ 26,**సింగరేణి సంస్థ ఇల్లందు ఏరియా సింగరేణి హై స్కూల్ నందు వేసవి సెలవుల్లో భాగంగా 7వ, 8వ, 9వ తరగతుల వారికీ ఇంటర్మీడియట్ విద్యార్దిని, విద్యార్థులకు పూర్తి ఉచితంగా స్పోకెన్ ఇంగ్లీష్ తరగతులు నిర్వహించినట్లు ఏరియా జనరల్ మేనేజర్ వి కృష్ణయ్య శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇల్లందు సింగరేణి కాలరీస్ ఏడెడ్ ఉన్నత పాఠశాలలో ఈనెల 28వ తేదీ నుంచి స్పోకెన్ ఇంగ్లీష్ తరగతులు ప్రారంభిస్తున్నటు తెలిపారు. ఈ శిక్షణను స్థానిక విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పూర్తి వివరాలకు ఇల్లందు ఏరియా సింగరేణి పాఠశాల హెడ్మాస్టర్ ను సంప్రదించగలరని తెలిపారు.

# సోమవారం జివిఎంసి ప్రధాన కార్యాలయం లో మాత్రమే ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం రద్దు

- విశాఖ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో, జీవీఎంసీ అన్ని జోనల్ కార్యాలయాలలో యధాతథంగా పి జి ఆర్ ఎస్ కార్యక్రమం నిర్వాహణ
- విశాఖ జిల్లా కలెక్టర్ ,జివిఎంసి ఇన్చార్జి కమిషనర్ ఎమ్ ఎన్. హరేంధిర ప్రసాద్



**సి కే న్యూస్ విశాఖపట్నం ప్రతినిధి ( రవికుమార్ ) ఏప్రిల్ 26 :** మహా విశాఖపట్నం నగరపాలక సంస్థ మేయర్ పదవికి 2025 ఏప్రిల్ 28వ తేదిన సోమవారం జివిఎంసి ప్రధాన కార్యాలయం లో ఎన్నిక జరుగనున్న నేపథ్యంలో పోలీసు వారు చేపట్టబోయే రక్షణ చర్యల కారణంగా , సోమవారం నిర్వహించవలసిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక ( పబ్లిక్ గ్రీవాన్స్ రెడ్రెస్సల్ సిస్టం -పి జి ఆర్ ఎస్ ) కార్యక్రమాన్ని జివిఎంసి ప్రధాన కార్యాలయం లో మాత్రమే రద్దు చేయడమైనదని, విశాఖ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో , జీవీఎంసీ అన్ని జోనల్ కార్యాలయాలలో సోమవారం అనగా ఏప్రిల్ 28వ తేదిన ఉ.గం.11.00 నుండి మధ్యాహ్నం 1.00 వరకు ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పి జి ఆర్ ఎస్ ) కార్యక్రమం యధాతథంగా నిర్వహించడం జరుగునని విశాఖ జిల్లా కలెక్టర్, జివిఎంసి ఇన్చార్జి కమిషనర్ ఎమ్ ఎన్.హరేంధిర ప్రసాద్ పత్రికా ప్రకటన ద్వారా శనివారం తెలిపారు. కావున, నగరంలో పారిశుద్ధ్యం, పట్టణ ప్రణాళిక విభాగం, మొక్కల విభాగం, రెవిన్యూ, యు సి డి, ఇంజినీరింగ్ మొదలగు జీవీఎంసీ విభాగాలకు సంబంధించిన సమస్యలపై జీవీఎంసీ జోనల్ కార్యాలయాలలో, అలాగే కలెక్టర్ కార్యాలయంలో జరుగనున్న ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో నగర ప్రజలు ఏప్రిల్ 28 వ తేదీ సోమవారం ఉదయం 11.00 గంటల నుండి మధ్యాహ్నం 1.00 గంట వరకు అర్జీలు / వినతులు ద్వారా సమస్యలను తెలియపరుచుకోవచ్చునని నగర ప్రజలకు విశాఖ జిల్లా కలెక్టర్ ,జీవీఎంసీ ఇంచార్జ్ కమిషనర్ తెలియచేశారు.

## పహల్గాం దాడిని తీవ్రంగా ఖండిస్తు దిష్టిబొమ్మ దగ్ధం



**సి కే న్యూస్ ఇల్లందు నియోజకవర్గ ప్రతినిధి, (వెంకటేష్)ఏప్రిల్ 26,**జమ్మూ కాశ్మీర్‌లో కుటుంబ సభ్యులతో ఆనందంగా గడుపుతున్న పర్యాటకులపై విచక్షణారహితంగా కాల్పులు జరిపి 28 మంది పర్యాటకులను పొట్టన బెట్టుకున్న తీవ్రవాదుల దుశ్చర్యను సిపిఎం పార్టీ తీవ్రంగా ఖండించింది. ఈ దాడిలో ప్రాణాలు కోల్పోయిన వారికి సంతాపాన్ని తెలియజేస్తూ వారి కుటుంబాలకు సానుభూతి తెలిపింది. ఈ దుశ్చర్యలకు పాల్పడిన ఉగ్రవాదం నశించాలని దిష్టిబొమ్మ దగ్ధం చేశారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు అబ్దుల్ నబి, మండల కార్యదర్శి ఆలేటి కిరణ్ లు మాట్లాడుతూ... ఇంతటి దారుణానికి పాల్పడిన కిరాతకులను పట్టుకుని శిక్షించాలని పేర్కొన్నారు.అక్కడ పోలీసులు, భద్రతా దళాలు కేంద్ర ప్రభుత్వ అధీనంలో వున్నాయి. ఈ దాడికి పాల్పడిన వారిని పట్టుకోవడానికి కేంద్ర ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకోవాలని కోరారు. ఇటువంటి దారుణమైన నేరాలకు పాల్పడేవారు దేశానికి, ముఖ్యంగా కాశ్మీర్ ప్రజలకు శత్రువులని పేర్కొన్నారు. పర్యాటకులతో రద్దీగా వుండే ప్రాంతాల్లో సరైన భద్రత లేకపోవడంతో సహా దాడికి సంబంధించిన పలు కోణాల్లో తక్షణమే సమగ్ర దర్యాప్తు చేపట్టాల్సిన బాధ్యత కేంద్ర ప్రభుత్వానిదేనని పేర్కొన్నారు.ఈ విషాద సమయంలో ఉగ్రవాద, ఛాందసవాద శక్తులకు వ్యతిరేకంగా దేశ ప్రజలకు సిపిఎం బాసటగా నిలబడుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తాళ్లూరి కృష్ణ, మన్నెం మోహన్ రావు, సుల్తానా, సంధ్య, వెంకటమ్మ, ఆర్ బి జె రాజు, వజ్జా సురేష్, వీరయ్య, రమణ తదితరులు పాల్గొన్నారు.

## పార్టీ సంస్థాగత నిర్మాణానికి పాటుపడాలి

**- రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ జెండా రెపరెపలాడాలి**
**- ప్రజా సమస్యలను పరిశీలించి పరిష్కార మార్గాలు చూపించాలి**
**- ప్రభుత్వ పథకాల అమలులో కేంద్ర విధానాన్ని ప్రతిభింబించాలి**
**- బిజెపి శ్రేణులకు పాపారావు, నెల్లూరి పిలుపు**
**- సంఘటన సంరచనా కార్యక్రమం ద్వారా పలు సూచనలు.**



**సి కె న్యూస్ ప్రతినిధి:**భారతీయ జనతా పార్టీని సంస్థాగతంగా నిర్మించడానికి పార్టీ శ్రేణులు సైనికుల్లా పని చేయాలని, ముఖ్యంగా రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బిజెపి జెండా రెపరెపలాడేలా ప్రతి కార్యకర్త కృషి చేయాలని ఆ పార్టీ ఖమ్మం జిల్లా ప్రభారీ పాపారావు, జిల్లా అధ్యక్షులు నెల్లూరి కోటేశ్వరరావులు పిలుపునిచ్చారు. సంఘటన సంరచన కార్యశాల ద్వారా పార్టీ సంస్థాగత నిర్మాణం అనే అంశంపై జిల్లా అధ్యక్షులు నెల్లూరి కోటేశ్వరరావు అధ్యక్షతన ఖమ్మం నగరంలోని హోటల్ మినార్వ గ్రాండ్‌లో శనివారం స్టడీ సర్కిల్ జరిగింది. ఈ సందర్భంగా జిల్లా ప్రభారీ పాపారావు, జిల్లా అధ్యక్షులు నెల్లూరి కోటేశ్వరరావులు పార్టీ బలోపేతానికి రూపొందించాల్సిన కార్యాచరణ, ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో బూత్ లెవల్‌లో నిర్వహించాల్సిన బాధ్యతల గురించి పార్టీ శ్రేణులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండల కమిటీ నిర్మాణంలో భాగంగా అధ్యక్షుడితో పాటు మరో 45 మంది పదాధికారులతో కమిటీని ఏర్పాటు చేయాల్సి ఉంటుందని, అందులో 4ఉపాధ్యక్షులు, 2 ప్రధాన కార్యదర్శులు, 4 కార్యదర్శులు, 1 కోశాధికారి ఉండాలని పేర్కొన్నారు. అందులో మహిళలు, ఇతర సామాజిక వర్గాలకు ప్రాధాన్యత కల్పించాలని పేర్కొన్నారు. అలాగే మండల ప్రభారీలు నిర్వహించాల్సిన విధులపై పలు సూచనలు చేశారు. ఈనెల 30వ తేదీలోపు ఈ ప్రక్రియ పూర్తి చేయాల్సి ఉందని, అలాగే పార్టీ క్రియాశీలక సభ్యత్వాల నమోదుతో పాటు సాదారణ సభ్యత్వ నమోదుపై దృష్టి పెట్టాలని సూచించారు. ఇక పోలింగ్ బూత్ కమిటీలను పూర్తి స్థాయిలో ఏర్పాటు చేసి బూత్ కమిటీ సంస్థాగత నిర్మాణానికి కృషి చేసి, తద్వారా రాబోయే ఎన్నికల్లో పార్టీ గెలుపుకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. అలాగే ఇతరత్రా ఏద్కెనా సలహాలు, సూచనలతో పాటు, ఏమైనా ఇబ్బందులు తలెత్తినట్లయితే జిల్లా పార్టీ కార్యాలయానికి సమాచారం ఇవ్వాలని, తద్వారా సమస్యలు ఉత్పన్నం కాకుండా ముందుకు సాగాలని కోరారు. ఈ కార్యక్రమంలో పార్లమెంటు కన్వీనర్ నంబూరి రామలింగేశ్వర రావు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సన్నే ఉదయ్ ప్రతాప్, ఇవి రమేష్, వాగదాని పుల్లారావు యాదవ్, జిల్లా ప్రధాన కార్యదర్శి నున్న రవికుమార్, భూక్య శ్యాంసుందర్ నాయక్, జిల్లా ఉపాధ్యక్షులు గుత్తా వెంకటేశ్వర్లు, వేల్పుల సుధాకర్, జిల్లా అధికార ప్రతినిధి నల్లగట్టు ప్రవీణ్ కుమార్, బిజెపి సీనియర్ నాయకులు మందడపు సుబ్బారావు, అసెంబ్లీ కన్వీనర్లు, అల్లిక అంజయ్య, సంతోష్ రెడ్డి, బట్టు వీరంరాజు, ఏలూరు నాగేశ్వరరావుతో పాటు అన్ని మండల అధ్యక్షులు ప్రభారీలు ఇతరులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## రాంపూర్ గ్రామంలో లో దొంగలు బాబోయ్ దొంగలు




**సీకే న్యూస్ ఏప్రిల్ 26 శనివారం హనుమకొండ జిల్లా ధర్మసాగర్ మండలం ప్రతినిధి కమలాకర్:** రాంపూర్ గజ్జలబండ ప్రాంతంలో నివసిస్తున్న బానోత్ శంకర్ ఇంట్లో ఇద్దరు గుర్తుతెలియని వ్యక్తులు చొరబడి బీరువా పగలగొట్టి అందులో ఉన్నటువంటి నాలుగు బంగారు కమ్మలు ముప్పావు తులం వెండి వస్తువులు దొంగిలించినారని దరఖాస్తు ఇవ్వగా, ఇట్టి దరఖాస్తు పై కేసు నమోదు చేసిన ధర్మసాగర్ పోలీసు విచారణ ప్రారంభం చేసి, రెండు రోజుల్లోనే అట్టి దొంగతనంకి పాల్పడిన ఇద్దరు వ్యక్తులను గుర్తించి, అట్టి వారిని పట్టుకుని విచారించగా వారు విలాసవంతమైన జీవితానికి అలవాటు పడి, తమ ద్విచక్ర వాహనానికి టి ఆర్ నెంబర్ పెట్టుకొని, ఒంటరిగా ఉన్న ఇండ్ల లోకి చొరబడి దొంగతనాలు చేస్తున్నామని చెప్పినారు. ఇట్టి వ్యక్తులపై గతంలో కేయూసీ, సుబేదారి, మడికొండ పోలీస్ స్టేషన్లో పలు దొంగతనాల కేసులు కలవు, నిందితులు
1.ధరావత్ గణేష్, తండ్రి వీరన్న, ఎస్టి లంబాడా, వృత్తి లారీ డ్రైవర్ మేస్త్రి పని, నివాసం యాదవ నగర్ హనుమకొండ. 2. బానోత్.విజయ్ తండ్రి రాములు, ఎస్ టి లంబాడా, వృత్తి: కారు డ్రైవర్ మేస్త్రి పని, నివాసం:ఇందిరమ్మ క్వార్టర్స్, కడిపికొండ హనుమకొండ.

## రాజుపేట గ్రామంలో ఉచిత సింగరేణి ఉచిత వైద్య శిబిరం.



**సీ కే న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, ( సాయి కౌశిక్),ఏప్రిల్ 26,**శనివారం మణుగూరు మున్సిపాలిటీ పరిధిలోని రాజుపేట ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో సింగరేణి వైద్య విభాగం మరియు సింగరేణి సేవా సమితి సంయుక్త నిర్వహణలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు.
సింగరేణి యాజమాన్యం తమ వంతు సామాజిక భాద్యతగా బొగ్గు గనుల ప్రాజెక్ట్ ప్రభావిత మరియు పరిసర గ్రామాల ప్రజలకు ఉచిత వైద్య సేవలు అందిస్తున్న క్రమంలో రాజుపేట గ్రామం వద్ద గల ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల నందు వైద్య శిబిరం నిర్వహింకడం జరిగింది. ఈ వైద్య శిబిరంలో స్త్రీ, పురుషులు మరియు వృద్ధులు కలిపి మొత్తం 65 మందిని సింగరేణి ఏరియా ఆసుపత్రి వైద్యులు శ్రీ శేషగిరి రావు గారు గ్రామస్తులను పరీక్షించి ఈ వైద్య శిబిరంలో సాధారణ వ్యాధులకు ఉచితంగా మందులు ఇవ్వడంతో పాటు బిపి, షుగర్ వ్యాధిగ్రస్తులు పరీక్షించి వారికి కూడా వ్యాధి నియంత్రణ మందులు ఇవ్వడంతో పాటు వ్యక్తిగత మరియు పరిసరాల పరిశుభ్రత ఆవశ్యక్త పై గ్రామస్తులకు అవగాహన కల్పించడం జరిగింది. అలాగే ఈ వైద్య శిబిరం నందు పాల్గొన్న వారిలో కొందరిని గుర్తించి ఏరియా హాస్పిటల్ లో మెరుగైన వైద్యం కొరకు వారిని రిఫర్ చేయడమైనదని అందులో ఒకరిని ఇవాళ పివి కాలనీ ఏరియా హాస్పిటల్ లో అడ్మిట్ చేయగా మిగితా వారిని సోమవారం రోజు రక్త పరీక్షలన%శీ%తరం వైద్యం అందించడం జరుగుతుందని అధికార ప్రతినిధి, డిజిఎం(పర్సనల్) ఎస్ రమేశ్ తెలియజేశారు.
ఈ కార్యక్రమంలో మేనేజర్ మణుగూరు ఓసిగ బైరెడ్డి వెంకటేశ్వర్లు, సేఫ్టీ అధికారి శ్రీ ఆర్.భాస్కర్ రావు, స్టాఫ్ నర్స్ యూ.భవాని, ఆసుపత్రి సిబ్బంది నాగ సాయి, భాను ప్రసాద్, రాజుపేట ఆశ వర్కర్ భూక్యా గౌరి,తదితరులు పాల్గొన్నారు.

# కృషికి దక్కిన ఫలితం.

- గంజాయి నిర్మూలనలో ఎస్సై విజయలక్ష్మి మార్క్.
- రివార్డు తో అభినందించిన డిజిపి.
- తెలంగాణ వ్యాప్తంగా 65 మంది పోలీసులు ఎంపిక.
- భద్రాద్రి జిల్లా నుంచి 35 మంది పోలీసులు ఎంపిక.
- ఎంపికైన వారిలో ఒకే ఒక్క మహిళా పోలీసు అధికారిణి విజయలక్ష్మి.



**సీ కే న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, ( సాయి కౌశిక్),ఏప్రిల్ 26,** భద్రాచలం పట్టణంలో ఎస్సై -1 గా విధులు నిర్వహించిన జి. విజయలక్ష్మికు అరుదైన గౌరవం లభించింది. మూడు రాష్ట్రాలకు అనుబంధమైన భద్రాచలం చెక్ పోస్టు మీదుగా గంజాయి తరలి వెళ్లకుండా అరికట్టడంలో తన ప్రతిభ చాటారు. విజయలక్ష్మి కృషికి గాను పోలీస్ శాఖ డిజిపి రివార్డుతో అభినందించారు. రివార్డుకు మొత్తం 65 మంది పోలీసు అధికారులు ఎంపికవగా.... భద్రాద్రి కొత్తగూడెం జిల్లా నుంచి 35 మంది పోలీసు అధికారులు ఎంపికయ్యారు.అందులో కేవలం ఒకే ఒక్క మహిళ పోలీస్ అధికారిణి విజయలక్ష్మి మాత్రమే ఉండడం విశేషం.

## శేరిలింగంపల్లి నియోజకవర్గ సమగ్ర,సంతులిత , అభివృద్దే నా ధ్యేయం పిఏసీ చైర్మన్ ఆరెకపూడి గాంధీ



**శేరిలింగంపల్లి సి కే న్యూస్** రూ. 8 కోట్ల 06 లక్షల రూపాయలతో సీసీ రోడ్ల నిర్మాణం పనులకు శంకుస్థాపన చేసిన పిఏసీ చైర్మన్ ఆరెకపూడి గాంధీ.

కొండాపూర్ డివిజన్ పరిధిలోని క్యామ్లెట్ లే ఔట్ కాలనీ, మాధవ హిల్స్, గోల్డెన్ తులిప్, రాజరాజేశ్వరి కాలనీ, మార్తాండ్ నగర్, హనీఫ్ కాలనీ,ప్రేమ్ నగర్ ఎ బ్లాక్ కాలనీలలో రూ. 2 కోట్ల75 లక్షల రూపాయల అంచనావ్యయం తో నూతనంగా చేపట్టబోయే సీసీ రోడ్ల నిర్మాణము పనులకు కార్పొరేటర్ హమీద్ పటేల్ తో కలిసి ముఖ్యఅతిథిగా పాల్గొని శంకుస్థాపన చేసిన పిఏసీ చైర్మన్ ఆరెకపూడి గాంధీ.

ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజల సంక్షేమం మరియు శేరిలింగంపల్లి నియోజకవర్గం మరియు కాలనీ ల అభివృద్దే ధ్యేయంగా ప్రజల సౌకర్యార్థం 8 కోట్ల 6 లక్షల రూపాయల తో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసుకోవడం జరిగినది అని, దానిలో భాగంగా కొండాపూర్ డివిజన్ పరిధిలోని క్యామ్లెట్ లే ఔట్ కాలనీ, మాధవ హిల్స్, గోల్డెన్ తులిప్, రాజరాజేశ్వరి కాలనీ, మార్తాండ్ నగర్, హనీఫ్ కాలనీ,ప్రేమ్ నగర్ ఎ బ్లాక్ కాలనీలలో రూ. 2 కోట్ల75 లక్షల రూపాయలతో సీసీ రోడ్ల నిర్మాణం పనులకు శంకుస్థాపన చేసుకోవడం జరిగినది అని, సీసీ రోడ్ల పనులకు శంకుస్థాపన చేసుకోవడం చాలా సంతోషకరమైన విషయం అని, కాలనీ వాసులకు ఉపశమనం లభించింది అని, మౌళిక వసతుల కల్పనకు పెద్ద పీట వేస్తానని సంక్షేమం మరియు అభివృద్ధికి ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తుందని ముఖ్యమంత్రివ రేవంత్ రెడ్డి మార్గదర్శకం లో శేరిలింగంపల్లి నియోకజకర్గంను అన్ని రంగాలలో అభివృద్ధి చేసి ఆదర్శవంతమైన ,అగ్రగామి నియోజకవర్గంగా తీర్చిదితానని తెలియచేసారు. అదేవిధంగా మౌలిక వసతుల కల్పనకు పెద్ద పీట వేస్తామని, సీసీ రోడ్లు వంటి అభివృద్ధి పనులను నాణ్యత ప్రమాణాలతో చేపట్టాలని ,నాణ్యత విషయంలో ఎక్కడ రాజి పడకూడదని , ప్రజలకు ట్రాఫిక్ రహిత ,సుఖవంతమైన ,మెరుగైన రవాణా సౌకర్యం కొరకు శాయ శక్తుల కృషి చేస్తానని,అన్ని రంగాలలో అభివృద్ధి చేస్తానని పనుల్లో జాప్యం లేకుండా త్వరిత గతిన పనులు పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలను అధికారులను ఆదేశించడం జరిగినది , ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యం కలిపిస్తామని ,ప్రజలకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా సుఖవంతమైన ప్రయాణానికి బాటలు వేస్తామని నియోజకవర్గ అభివృద్ధికి శాయశక్తులా కృషి చేస్తానని ,అన్నివేళలో ప్రజలకు అందుబాటులోకి ఉంటానని ,మెరుగైన ప్రజా జీవనానికి అన్ని రకాల మౌలిక వసతుల కల్పనకు తనవంతు కృషి చేస్తానని, కొండాపూర్ డివిజన్ మరియు శేరిలింగంపల్లి నియోజకవర్గాన్ని ఆదర్శవంతమైన నియోజకవర్గంగా తీర్చిదిద్దుతానని పునరుద్ఘాటించారు

ఈ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు, కాలనీ వాసులు, కాలనీల అసోసియేషన్ సభ్యులు,మహిళలు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు

# గ్రీన్ పార్క్ హోటల్ లో జరిగిన ఎం ఎం ఎన్ అరియల్ బిజినెస్ మీట్ లో ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్

**సి కే న్యూస్ విశాఖపట్నం ప్రతినిధి ( రవికుమార్ ) ఏప్రిల్ 26 :** గ్రీన్ పార్క్ హోటల్ లో జరిగిన ఎం ఎం ఎన్ అరియల్ బిజినెస్ మీట్ లో జనసేన పార్టీ విశాఖ నగర అధ్యక్షులు దక్షిణ నియోజకవర్గ వంశీకృష్ణ శ్రీనివాస్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్య్ వంశీకృష్ణ శ్రీనివాస్ నెట్వర్కింగ్ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. ప్రతి ఒక్కరు క్రమశిక్షణ , నైపుణ్యంతో ఉన్నత శిఖరాలకు చేరుకోవచ్చని అన్నారు. అనంతరం పలువురు సభ్యులకు ఎమ్మెల్యే చేతుల మీదుగా సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేశారు.కార్యక్రమంలో సంస్థ ఫౌండర్ రాజు , రమేష్ , కామేష్ , సంస్థ సభ్యులు పాల్గొన్నారు.



# జమ్మూ కాశ్మీర్ పహల్గాంలో ఉగ్రవాద దాడి అత్యంత హేయమైన చర్య...

**ఉగ్రమూకల దుశ్చర్యను తీవ్రంగా ఖండించిన పిఏసి చైర్మన్ ఆరెకపూడి గాంధీ**

**శేరిలింగంపల్లి సి కే న్యూస్** మృతుల కుటుంబాలకు సంతాపం తెలియచేసిన పిఏసి చైర్మన్ ఆరెకపూడి గాంధీ

జమ్మూకాశ్మీర్ పహల్గాం లో జరిగిన పాకిస్తాన్ ఉగ్రదాడి కి నిరసనగా ఆల్విన్ కాలనీ డివిజన్ పరిధిలోని గుడ్ విల్ హోటల్ చౌరస్తా వద్ద యువనేత దొడ్ల రామకృష్ణ గౌడ్ ఆధ్వర్యంలో పాకిస్తాన్ ఉగ్రవాదుల దిష్టి బొమ్మ దహనం కార్యక్రమంలో కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ తో కలిసి ఉగ్రవాదుల దిష్టి బొమ్మ దహనం చేసిన పిఏసి చైర్మన్ ఆరెకపూడి గాంధీ.

ఈ సందర్భంగా మాట్లాడుతూ జమ్ముకాశ్మీర్ పహల్గాం లో చోటుచేసుకున్న ఉగ్రవాద దాడి అత్యంత హేయమైన చర్య అని,ఉగ్రదాడి అమానుషం అని, జరిగిన సంఘటన చాలా బాధ కలిగించినది అని,ఉగ్రవాదులను ఉపేక్షించే ప్రసక్తే లేదు అని, పలు ప్రాంతాల నుంచి వచ్చిన 26 మంది పర్యాటకులను ఉగ్రవాదులు దారుణంగా కాల్చి చంపడం అమానవీయ చర్యగా పేర్కొంటూ,ఈ దుశ్చర్య సంఘటనపై దిగ్భ్రాంతి, తీవ్ర విచారం వ్యక్తం చేస్తున్నాను అని తెలియచేసారు.

ఉగ్రవాదుల దాడుల్లో ప్రాణాలు కోల్పోయిన ప్రజలను స్మరించుకొని కొవ్వొత్తులు వెలిగించి వారికి ఘన నివాళులు అర్పించారు, మానవత్వానికి మచ్చ తెచ్చే ఇలాంటి సంఘటనలను ఉపేక్షించేది లేదు, ఉగ్రవాదాన్ని ఈ ప్రపంచంలో ఉండకుండ నియంత్రించాల్సిన బాధ్యత ప్రపంచంలోనీ ప్రతి ఒక్కరిపై ఉందని, ఉగ్రవాదుల దాడుల్లో ప్రాణాలను కోల్పోయిన కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూన్నాను, వారి పవిత్ర ఆత్మలకు శాంతి చేకూరాలని తెలియచేసారు.

సామాన్యులను,మిలట్రీ అధికారులను, సైన్యాన్ని, పర్యాటకులను ఇలా ఎంతమందిని పొట్టన పెట్టుకుంటారన్నారు. దేశ సమగ్రతను విచ్చిన్నం చేయడానికి కొంతమంది విచ్చిన్నకారులు, ఉగ్రవాదులు ప్రయత్నం చేస్తున్నారని, దేశమంతా ఒక్కటై ఉక్కు పిడికిలితో ఉగ్రవాదాన్ని కూకటివేళ్ళతో పెకిలించాలన్నారు. దాడిని నిర్ద్వంద్వంగా ప్రతి ఒక్కరూ ఖండిచాలని తెలిపారు. అమాయక పౌరులపై, ముఖ్యంగా పర్యాటకులపై దాడి చేయడం భయంకరమైనదని, క్షమించరానిదని తెలియచేసారు. మృతుల కుటుంబాలకు ఎమ్మెల్యే గాంధీ సంతాపం తెలిపారు. బాధిత కుటుంబాలను కేంద్ర ప్రభుత్వం ఆదుకుని అండగా నిలవాలని , క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని కోరారు. గాయపడిన వారు వేగంగా కోలుకోవాలని ఆయన ఆక్షాంక్షించారు. టెర్రరిస్టుల మారణకాండ ఎక్కడా పునరావృతం కాకుండా కేంద్ర ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని పిఏసి చైర్మన్ గాంధీ తెలియచేసారు.

ఈ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు, కాలనీ వాసులు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# మాజీ ప్రధాని అటల్ బీహార్ వాజ్పేయి శత జయంతి ఉత్సవాలు



**శేరిలింగంపల్లిసి కే న్యూస్** వాజ్‌పేయి తన వాక్చాతుర్యం, రాజనీతిజ్ఞత, దేశభక్తితో అందరి హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిన నాయకుడు- రాజ్యసభ సభ్యులు లక్ష్మణ్ ఓటమి మరియు విజయం జీవితంలో భాగం, వాటిని సమ దృష్టితో చూడాలి,ఇది ఆయనలోని సమచిత్తాన్ని, జీవితంలోని కష్టసుఖాలను సమానంగా స్వీకరించే తత్వాన్ని తెలియజేస్తుంది- రంగారెడ్డి అర్బన్ జిల్లా అధ్యక్షులు వానిపల్లి శ్రీనివాస్ రెడ్డి క్విట్ ఇండియా ఉద్యమం లో మొదలుకొని కార్గిల్ యుద్ధం జరిపి భారతదేశా పరాక్రమాన్ని కాపాడిన నేత వాజ్పాయ్- నియోజకవర్గ ఇన్చార్జ్ రవికుమార్ యాదవ్

ఈరోజు రాష్ట్ర పార్టీ సూచన మేరకు అటల్ బిహారీ వాజ్పేయి శత దినోత్సవ కార్యక్రమాల్లో సందర్భంగా మియాపూర్ ఆల్విన్ కాలనీ శ్రీయ బ్యాంకిట్ హాల్ నందు ఈ కార్యక్రమ కన్వీనర్ కేశవ రావు ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఈ కార్యక్రమంలో ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షులు, రాజ్యసభ సభ్యులు లక్ష్మణ్ , రంగారెడ్డి అర్బన్ జిల్లా అధ్యక్షులు శ్రీనివాస్ రెడ్డి, జిల్లా మాజీ అధ్యక్షులు సామ రంగారెడ్డి, నియోజకవర్గ ఇన్చార్జి రవి కుమార్ యాదవ్ మరియు భారతీయ జనతా పార్టీ సీనియర్ నాయకులు పాల్గొని అటల్ బిహారీ వాజ్పేయి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా ఘనంగా నివాళులు అర్పిస్తూ ఆయన చేసిన సేవలను గుర్తు చేస్తూ నేటి తరానికి ఆయన చేసిన సేవలు అందరికీ తెలిసే విధంగా సెమినార్, ఫోటో ఎగ్జిబిషన్ ఏర్పాటు చేశారు.

ఈ సభ ముఖ్య ఉద్దేశం మాజీ ప్రధాని అటల్ బీహార్ వాజ్పేయి కాలంలో ఆయనతోపాటు కలిసి పనిచేసిన సీనియర్ నాయకులను ఈ కార్యక్రమానికి ఆహ్వానించి ఆయనతో ఉన్న సంబంధాలను, ఆయన చేసిన గొప్ప గొప్ప సంస్కారాలను ఈ సభలో చర్చించడమే ఈ కార్యక్రమ ఉద్దేశం అని నిర్వాహకులు తెలిపారు.

అతిథిగా వచ్చినటువంటి లక్ష్మణ్ మాట్లాడుతూ మధ్య ప్రదేశ్ లోని గ్వాలియర్లో జన్మించిన వాజ్పేయి భారతీయ జనతా పార్టీకి తన చిన్నతనం నుండి పార్టీ అభివృద్ధికి పాటుపడుతూ అంచలంచలుగా ఎదుగుతూ దేశ ప్రధానిగా ఎదిగారని గుర్తు చేశారు. ఆయన తండ్రి కృష్ణబిహారీ వాజపేయి గ్వాలియర్ ప్రాంతంలో ఒక ఉపాధ్యాయుడు, మంచి కవి వాజపేయి గ్వాలియర్ లోని సరస్వతి శిశు మందిర్ లో విద్యాభ్యాసం ముగించుకుని,1939 లో రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ (ఆర్.ఎస్.ఎస్.) లో చేరి 1947 లో "పూర్తి స్థాయి సేవకుడు" అనగా ఆర్.ఎస్.ఎస్. ప్రచారక్ అయ్యాడని తెలిపారు.

1942 ఆగస్టులో క్విట్ ఇండియా ఉద్యమంలో బ్రిటిష్ వారికి వ్యతిరేకంగా పోరాడి జైళ్ళకు వెళ్లిన వీరుడు అని గుర్తు చేశారు.

1951 లో క్రొత్తగా ఏర్పడిన భారతీయ జనసంఘ్ అనే హిందూ దక్షిణ పక్ష రాజకీయపార్టీలో పనిచేయడానికి, దీన్ దయాళ్ ఉపాధ్యాయతో పాటు వాజపేయిని ఆర్.ఎస్.ఎస్ శాఖ నియమించింది.

1980 లో భారతీయ జనతా పార్టీని ఏర్పరచి, మొట్టమొదటి అధ్యక్షునిగా అనుభవం గల వ్యక్తి 1980 నుండి 1986 వరకు భారతీయ జనతా పార్టీకి వ్యవస్థాపక అధ్యక్షుడిగా పనిచేశారు తెలిపారు.

అటల్ జీ 1957లో వాజపేయి బల్రామ్‌పూర్ నియోజకవర్గం నుండి మమొదటి సారిగా రెండవ లోక్‌సభకు ఎన్నికయ్యారు. మధ్యలో 3వ, 9వ లోక్‌సభలకు తప్పించి 14వ లోక్‌సభ ముగిసేవరకు పార్లమెంటుకు ప్రాతినిధ్యం వహించారు.రెండుసార్లు రాజ్యసభకు కూడా ఎన్నికయ్యారు.

1996లో తొలిసారిగా ప్రధానమంత్రి పదవి యోగం లభించినా అది 13 రోజులకే పరిమితం కాగా 1998లో రెండో పర్యాయం ప్రధానమంత్రి పదవి పొంది 13 మాసాలు పాలించి,1999లో 13వ లోక్‌సభ ఎన్నికల అనంతరం మరోసారి ప్రధానమంత్రి పదవి చేపట్టి 2004 వరకు పదవిలో ఉన్నారు.

వాజపేయి మూడవ దఫా పరిపాలనా కాలంలో అనేక దేశీయ ఆర్థిక, మౌలిక సంస్కరణలను చేపట్టాడు. వాటిలో ప్రైవేటు రంగాన్ని, విదేశీ పెట్టుబడులను ప్రోత్సహించాడు. కొన్ని ప్రభుత్వరంగ సంస్థలలో పరిశోధన, అభివృద్ధిని ప్రోత్సహించాడు. ప్రభుత్వపు వృధాఖర్చులను తగ్గించి, పరిశోధన, అభివృద్ధిని ప్రోత్సహించారు. కొన్ని ప్రభుత్వరంగ సంస్థలను ప్రైవేటీకరించాడు. గత 32 సంవత్సరాలలో అభివృద్ధి చెందిన రోడ్లలో సగం వరకు, వాజపేయి నేతృత్వంలోని ఎన్.డి.ఎ ప్రభుత్వం యొక్క ఐదేళ్ల పాలనలో అభివృద్ధి చెందినవే

వాజ్పేయి హయాంలో రహదారులు, రైల్వే లైన్లు, జల రవాణాలో దేశంలో ప్రపంచ స్థాయి మౌలిక వసతులకు బీజం పడింది.అటల్ బిహారీ వాజ్ పేయి పాలనలో అణు పరీక్షలు, టెలికాం రంగంలో సంస్కరణలు, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీకి మద్దతుతో అభివృద్ధిని పట్టాలెక్కిస్తూనే, సంక్షేమానికి పెద్దపీట వేశారు. వాజ్పేయి వారసత్వాన్ని అందిపుచ్చుకున్న నరేంద్ర మోదీ పాలనలో దేశాభివృద్ధి కొత్త పుంతలు తొక్కింది. "నేషనల్ హైవే డెవలప్‌మెంటు ప్రాజెక్టు", "ప్రధానమంత్రి గ్రామ సడక్ యోజన" వాజపేయి అభిమాన ప్రాజెక్టులు చెప్పుకోవచ్చు అని ఈ సభలో తెలిపారు.

అటల్ బిహారీ వాజ్పేయి కి 2015 మార్చి 27 న రాష్ట్రపతి ప్రణబ్ ముఖర్జీ,దేశ అత్యున్నత పౌర పురస్కారం భారతరత్న ప్రదానం చేసి గౌరవించారు.

ఆయన చేసిన ఎన్నో మంచి పనులు ఇప్పటికీ మన మధ్యలో ఉన్నాయని అందుకే ఆయనను రాజకీయ భీష్ముడు అని అభివర్ణిస్తారని రవికుమార్ యాదవ్ తెలిపారు.

ఈ కార్యక్రమంలో కేశవరావు, రామరాజు, మణిభూషణ్, అశోక్, వసంత్ యాదవ్, రమణయ్య రాధాకృష్ణ యాదవ్ , నరసింహా చారి, వినయ, పద్మ, మహేష్ యాదవ్ ,జితేందర్, లక్ష్మణ్, మొదలగు వారు పాల్గొన్నారు.

CK చంద్రకాంత్ NEWS తెలుగు దినపత్రిక

## జవాబు జగన్ చెప్పాల్సిందే.. ఇలా అయితే ఎవరుంటారు పార్టీలో?

మాజీ ఎంపీ విజయసాయిరెడ్డి మాటలను చూస్తుంటే ఒక్కటి మాత్రం అర్థం అవుతుంది. ఈ పరిస్థితిని జగన్ చేజేతులానే తెచ్చుకుంటున్నారు. నమ్మకమైన వారిని కూడా స్వయంగా జగన్ దూరం చేసుకుంటున్నారు. విజయసాయిరెడ్డి చెప్పే విషయాల్లో నిజాయితీ కనిపిస్తుంది. ఎందుకంటే సాయిరెడ్డి జగన్ పై ఎలాంటి దూషణలు చేయడం లేదు. అలాగే మద్యం కుంభకోణం విషయంలో డబ్బులు చేతులు మారాయన్న విషయం కూడా తనకు తెలియదనే సిట్ అధికారులకు చెప్పినట్లు తెలిసింది. అయితే రాజ్ కసిరెడ్డిపైనే ఆయన అక్కసు అంతా వెళ్లగక్కినా, జగన్ మాత్రమే కాదు ఆయన చుట్టూ ఉన్న కోటరీపైనే విజయసాయిరెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు.

**కావాలని తప్పుదోవ పట్టిస్తూ...**

జగన్ ను కొందరు కావాలని తప్పుదోవ పట్టించేలా వ్యవహరించారని అంటున్నారు. అధికారంలోకి వచ్చిన తర్వాత ఆరు నెలల నుంచి తనను జగన్ దూరం పెడుతున్నారని ఆయన చెబుతున్న మాటల్లో వాస్తవముంది. ఎందుకంటే అప్పటి వరకూ ఉత్తరాంధ్ర కో-ఆర్డినేటర్ గా ఉన్న విజయసాయిరెడ్డిని తప్పించి వైవీ సుబ్బారెడ్డికి బాధ్యతలను అప్పగించడంతోనే అందరికీ అర్థమయింది. దీంతో పాటు సాయిరెడ్డితో జగన్ అనుబంధాన్ని కట్ చేయడానికి అనేక మంది గత ఐదేళ్లలో కీలకంగా పనిచేశారన్నది కూడా వాస్తవమే. నిజానికి వైఎస్ రాజశేఖర్ రెడ్డి నుంచి జగన్ వరకూ విజయసాయిరెడ్డి కేవలం ఆడిటర్ గా మాత్రమే కాకుండా సొంత ఇంట్లో సభ్యుడిగా వ్యవహరించారు.

**నమ్మకమైన వారికే...**

జగన్ తో పాటు పదహారు నెలలు జైలుకు కూడా వెళ్లి వచ్చారు. జగన్ అధికారంలో లేనప్పుడు, ఉన్నప్పుడు సాయిరెడ్డి జగన్ మీద ఈగ వాలనిచ్చే వారు కాదు. అలాగే ప్రత్యర్థి పార్టీలపై సోషల్ మీడియాలో ఒక రేంజ్ లో ధ్వజమెత్తేవారు. సాయిరెడ్డి జగన్ ముఖ్యమంత్రి గా ఉన్న సమయంలో కూడా ఎక్కువ సార్లు సీఎం క్యాంప్ కార్యాలయంలో కూడా కనిపించే వారు కాదు. జగన్ తనకు ఢిల్లీలో అప్పగించిన బాధ్యతలను పూర్తి చేయడం వరకు మాత్రమే ఆయన పరిమితమయ్యారు. నాడు బీజేపీతో సంబంధాలు మంచిగా కొనసాగేలా సాయిరెడ్డి ఢిల్లీలో ఉండి పనులు చక్కబెట్టేవారు. ఒకరకంగా జగన్ ఐదేళ్ల పాటు ఢిల్లీ విషయాలను సాయిరెడ్డి మర్చిపోయేటట్లు చేశారు.

**సాధారణ నేతల పరిస్థితి ఏంటి?**

అలాంటి సాయిరెడ్డిని జగన్ దూరం చేసుకోవడం స్వయం కృతాపరాధం కాదా? జగన్ ఇక ఎవరిని నమ్ముతారు? తనంటే ఇష్టపడేవారిని, ప్రేమించే వారిని అధికారంలోకి వచ్చిన తర్వాత చెప్పుడు మాటలు విని దూరం చేసుకుంటే ఇక ఆయనకు ఎవరు మద్దతుగా నిలుస్తారు. కొన్నేళ్ల నుంచి నమ్మిన వ్యక్తినే జగన్ దూరం చేస్తే ఇక సాధారణ నేతల పరిస్థితి ఏంటని ఎవరికైనా ఆలోచన రాకమానదు. అందుకే జగన్ ఆలోచన కరెక్ట్ కాదు. ఇప్పుడు కోటరీ వాళ్లను కూడా దూరం చేయరని గ్యారంటీ ఏముంది? అందుకే జగన్ కు అందరూ దూరమవుతున్నారు. సొంత బంధువైన బాలినేని వంటి వారు మాత్రమే దూరమయితే ఇక మామూలు రాజకీయ నేతల మాటేమిటన్న సందేహం సహజంగా వైసీపీలో కొనసాగే నేతల్లో కలుగుతుంది. దీనికి జవాబు జగన్ చెప్పాల్సిందే.

# పురుషుల్లో సంతాన భాగ్యానికి అవరోధాలు ఇవి..!

**జీవనశైలి, ఆహార అలవాట్ల ప్రభావం కీలకం**

**రోజువారీ వ్యాయామం చేయడం వల్ల మంచి ఫలితం**

**ఒత్తిడి, అధిక, తక్కువ బరువు లేకుండా చూసుకోవాలి**



కొత్తగా పెళ్లయిన వారు, పిల్లల కోసం ప్లాన్ చేసుకుంటున్న వారు తమ లైంగిక ఆరోగ్యం గురించి ముందుగా సమగ్రంగా తెలుసుకోవడం మంచిది. గతంతో పోలిస్తే సంతాన సాఫల్యత సామర్థ్యం గణనీయంగా తగ్గుతూ వస్తోంది. కొందరికి పెళ్లయిన వెంటనే సంతానం కలుగుతుంటే, కొందరు ఏళ్ల తరబడి వేచి చూడాల్సి వస్తుంది. దీనికి ఎన్నో కారణాలు ఉండి ఉండొచ్చు. ముఖ్యంగా నేటి జీవనశైలి, ఆహారం అలవాట్లు ప్రధాన కారణంగా ఉంటున్నాయి. పురుషుల్లో సంతాన భాగ్యానికి అడ్డు పడుతున్న అంశాల గురించి ఇక్కడ చూద్దాం.

**ఆరోగ్యకరమైన జీవనశైలి**

పురుషుల్లో వీర్యకణాలు ఆరోగ్యంగా, చురుగ్గా ఉన్నప్పుడే సంతాన సాఫల్యత అవకాశాలు పుష్కలంగా ఉంటాయి. వీర్యం నాణ్యతపై జీవనశైలి ప్రభావం ఉంటుంది. అందుకని పోషకాహారం, సమతులాహారం, తగినంత నీరు తీసుకోవాలి. మద్యపానం, పొగతాగడం, ఇతర చెడు అలవాట్లకు దూరంగా ఉండాలి.

**ఒత్తిడి:** తీవ్ర ఒత్తిడి కూడా సంతానానికి అడ్డుగోడగా వ్యవహరిస్తుంది. హార్మోన్ల ఉత్పత్తి, వీర్య ఆరోగ్యాన్ని దెబ్బతీస్తుంది. వ్యాయామం, మెడిటేషన్, యోగా ద్వారా ఒత్తిడిని తొలగించుకోవచ్చు. మనసుకు ఉల్లాసాన్నిచ్చే వ్యాపకాలకు ప్రాధాన్యం ఇవ్వాలి.

**బరువు**

శరీర బరువు కూడా కీలక పాత్ర పోషిస్తుంది. అధిక బరువు, అదే సమయంలో తక్కువ బరువు ఉండకూడదు. ఈ విషయంలో న్యూట్రిషనిస్ట్ సలహా తీసుకోవడం మంచిది.

**కాలుష్యం**

పర్యావరణ కాలుష్య ప్రభావం కూడా సంతాన సాఫల్యతపై ఉంటుంది. అధిక వేడికి ఎక్కువ సమయం పాటు గురికాకుండా చూసుకోవాలి. పురుగు మందులు, మెటల్స్ ప్రభావం పడకుండా జాగ్రత్త పడాలి. గాలి కాలుష్యం ప్రభావం తగ్గించుకునేందుకు అధిక రక్షణనిచ్చే ఫేస్ మాస్క్ వాడాలి.


**వ్యాయామాలు:** క్రమం తప్పకుండా వ్యాయామాలు చేయడం వల్ల జీవక్రియలు మెరుగ్గా ఉంటాయి. లైంగిక సామర్థ్యం కూడా పెరుగుతుంది. శరీరంలోని వ్యర్థాలు బయటకు వెళ్లిపోవడమే కాకుండా, వ్యాధి నిరోధక శక్తి బలపడుతుంది. ఇది కూడా సంతాన సాఫల్యతను మెరుగుపరుస్తుంది. దీనికితోడు వైద్యుల దగ్గరకు వెళ్లి ఏవైనా అవరోధాలు ఉన్నాయేమో నిర్ధారించుకోవాలి.

# మధ్యాహ్నం తిన్న వెంటనే నిద్ర వస్తోందా..? ఇలా చేస్తే చాలు!

**ఈ సమస్యను నిర్లక్ష్యం చేయడం మంచిది కాదు**

**తీసుకునే ఆహారంలో మార్పులు చేసుకోవాలి**

**హెవీగా తినకుండా, పీచుకు ప్రాధాన్యం ఇవ్వాలి**



ఉదయం టిఫిన్ చేసిన తర్వాత ఉద్యోగ, వృత్తి, వ్యాపార జీవితం మొదలవుతుంది. మధ్యాహ్నం 12 గంటలు దాటిన తర్వాత నుంచి కడుపులో ఆకలి అనిపిస్తుంటుంది. దీంతో లంచ్ చేసే సమయం కోసం మనసు ఎదురు చూస్తుంటుంది. తీరా లంచ్ సమయం రాగానే కడుపునిండా తినేస్తాం. ఇక ఆ తర్వాత నుంచి నిద్ర పాట్లు మొదలవుతుంటాయి. కళ్లు మూతలు పడుతుంటాయి. సాధారణంగా ఎక్కువ మందికి ఇలాంటి అనుభవమే ఎదురవుతుంటుంది. అలా కొంత సమయం పాటు నిద్ర వేధిస్తుంటుంది.

తిన్న తర్వాత తిరిగి ఉత్సాహంగా పనిచేసుకునేట్లు ఉండాలి కానీ, ఈ నిద్ర గొడవ ఏంటిరా బాబూ? అని బాధపడే వారుంటారు. తిన్న తర్వాత నిద్ర వస్తుంటే దీన్ని పోస్ట్ ప్రాండియల్ సోమ్నోలెన్స్ అంటారు. అంటే ఫుడ్ కోమాగా దీన్ని చెబుతారు. ఎందుకని ఇది వస్తుంటుంది? దీనికి కారణాన్ని పరిశీలిస్తే శరీరం తిన్న తర్వాత మరింత సెరటోనిన్ ను ఉత్పత్తి చేస్తున్నట్టు పరిశోధనల్లో తేలింది. సెరటోనిన్ అనేది న్యూరోట్రాన్స్ మీటర్. నిద్ర, మూడ్ ను ఇది ప్రభావితం చేస్తుంటుంది. తిన్న తర్వాత ఇలా నిద్ర రావడం అన్నది అనారోగ్యం ఏమీ కాదు. కాకపోతే తిన్న తర్వాత పని చేయాల్సి ఉంటే పెద్ద అడ్డంకిగా మారుతుంది. దీన్ని అధిగమించేందుకు కొన్ని మార్గాలు ఉన్నాయి.

**పరిమాణం**

లంచ్ లో భాగంగా తీసుకునే ఆహార పరిమాణంపై ప్రత్యేక శ్రద్ధ అవసరం. ముఖ్యంగా హెవీగా (అధికంగా) తినకూడదు. సరిపడానే తినాలి. కొంత వెలితిగా తింటే మరీ మంచిది. పనిచేస్తూ అస్సలే తినొద్దు. దీనివల్ల ఎంత తింటున్నామన్నది పట్టింపు ఉండదు. ఉదయం బ్రేక్ ఫాస్ట్ ను మిస్ చేసుకోవద్దు. ఉదయం ఏమీ తినకపోయినా, మధ్యాహ్నం ఎక్కువగా తినాల్సి వస్తుంది. దాంతో నిద్ర ముంచెత్తుతుంది.

**మెనూ**

ఆహారంలో భాగంగా ఏమి తింటున్నామనేది కూడా ముఖ్యమే. ప్రొటీన్, కార్బోహైడ్రేట్స్ తో పోలిస్తే ఫ్యాట్ ఎక్కువగా ఉంటే దాన్ని జీర్ణం చేసుకోవడానికి శ్రమ పడాల్సి వస్తుంది. కనుక లంచ్ లో భాగంగా అధిక కొవ్వుతో ఉండే వాటికి దూరంగా ఉండాలి. ఇక అధిక కార్బోహైడ్రేట్స్ ఉన్న ఆహారంతోనూ ఇదే సమస్య ఎదురవుతుంది. కనుక పీచుతో కూడిన సమతులాహారం, పండ్లు, కూరగాయలతో కలిపి తీసుకోవాలి.

ముడి ధాన్యాలు మంచివి. పీచుతో ఉన్న వాటి వల్ల తిన్న వెంటనే రక్తంలోకి గ్లూకోజ్ ఒకేసారి విడుదల కాదు. లంచ్ లో భాగంగా షుగర్ తో కూడిన డ్రింక్స్ ను తాగొద్దు. వాటివల్ల కూడా రక్తంలో గ్లూకోజ్ పెరిగిపోతుంది. లంచ్ కు ముందు ఆల్కహాల్ ను సైతం తీసుకోవద్దన్నది నిపుణుల సూచన. లంచ్ ను ఎప్పుడూ బయట తినడం కాకుండా, ఇంటి ఆహారాన్నే తీసుకోవాలి.

**రాత్రి నిద్ర**

ఇక రాత్రి మంచి నిద్రపోయేలా జీవన చర్యల్లో మార్పు చేసుకుంటే, అప్పుడు కూడా మధ్యాహ్నం తిన్న తర్వాత నిద్ర వచ్చే సమస్య కనిపించదు. రాత్రి నిద్ర మంచిగా పోవడం వల్ల హార్మోన్ల విడుదల చక్కగా ఉంటుంది. జీవక్రియలు చురుగ్గా మారతాయి. దాంతో మధ్యాహ్నం నిద్ర సమస్య ఉండదు. నిద్ర లేమి వల్ల శరీరంలో గ్రెలిన్ పెరిగిపోతుంది. ఈ హార్మోన్ మెదడుకి బాగా ఆకలితో ఉన్నట్టు సంకేతాలు పంపిస్తుంది.

**మధుమేహం ఉన్నా అంతే..**

ఇక తిన్న వెంటనే నిద్ర కుమ్మేస్తుంటే, ఆహారంలో మార్పులు చేసుకున్న తర్వాత కూడా ఇందులో మార్పు లేకపోతే.. అప్పుడు మధుమేహం ఉందేమో ఓసారి పరీక్షలు చేయించుకోవాలి.

# నయన్ దూకుడు తగ్గడానికి రీజన్ అతనేనా..?



కోలీవుడ్ లేడీ సూపర్ స్టార్ నయనతార ఈమధ్య కాస్త దూకుడు తగ్గించిందని చెప్పొచ్చు. బాలీవుడ్ లో జవాన్ సినిమా చేసి సూపర్ హిట్ అందుకున్న నయనతార కోలీవుడ్ లో వరుస సినిమాలు చేస్తుంది. ఐతే ఎందుకో అమ్మడు ఇదివరకు అంత దూకుడు చూపించలేక పోతుంది. అంతేకాదు స్టార్ సినిమా ఆఫర్లు కూడా చాలా తగ్గిపోయాయి. ఇదివరకు అక్కడ టాప్ స్టార్స్ ఒకరు కాకపోతే మరొకరు నయనతారతో సినిమాలు చేస్తుంటారు.

ఆమె డేట్స్ అడ్జెస్ట్ కాకపోయినా సరే టైం ఇచ్చి మరీ ఆమెను తీసుకునే వారు. కానీ ఇప్పుడు పరిస్థితి చూస్తే అలా లేదు. నయనతారకు అవకాశాలు రాకపోవడం వెనక రీజన్ ఆమె ధనుష్ తో పడిన గొడవే అన్న టాక్ ఉంది. నయనతార పెళ్లి డాక్యుమెంటరీ పై ధనుష్ కేసు వేయడంపై తిరిగి నయన్ కూడా అదే రేంజ్ లో ఎటాకింగ్ కి దిగింది.ఐతే ఇక్కడ తప్పు ఎవరిది అన్నది పక్కన పెడితే నయన్ ధనుష్ మధ్య ఉన్న దూరం ఆడియన్స్ కు తెలిసింది. ఈ క్రమంలో ధనుష్ వల్ల నయనతారకు అవకాశాలు రాకుండా అవుతున్నాయి. కారణం అతనా కాదా అన్నది పక్కన పెడితే ధనుష్ తో నయన్ గొడవ ఆమె కెరీర్ మీద ఎఫెక్ట్ పడేలా చేసిందని చెప్పొచ్చు. ధనుష్ తో నయనతార కూడా కలిసి నటించింది. వాళ్లిద్దరు కలిసి నటించినప్పుడు ఎలాంటి గొడవలు లేవు.ఎప్పుడైతే ధనుష్ నిర్మాణంలో చేసిన నాన్ రౌడీ ధాన్ సినిమా క్లిప్ ని తన డాక్యుమెంటరీలో వాడిందో అప్పటి నుంచి ఆమెకు ధనుష్ తో దూరం పెరిగింది. ఇద్దరు ఎదురుపడ్డా పలకరించుకోలేనంతగా పరిస్థితులు వచ్చాయి. ఇలా స్టార్ హీరో స్టార్ హీరోయిన్ ఫైట్ పరిశ్రమకు మంచిది కాదని తెలిసినా కూడా వాళ్లు దాన్ని కొనసాగిస్తున్నారు.ఇక ఇదే దారిలో నయనతారకు రావాల్సిన అవకాశాలు కూడా కొన్ని మిస్ అవుతున్నట్టు తెలుస్తున్నాయి. మరి నయనతార ధనుష్ మధ్య ఈ డిస్టన్స్ ని ఎవరు దగ్గర చేస్తారన్నది చూడాలి. ఎవరికి వారు తమ సినిమాలు చేస్తూ ఉన్నా కూడా నయనతార కెరీర్ లో స్పీడ్ తగ్గిందన్నది మాత్రం ప్రత్యక్షంగా కనిపిస్తుంది.



జినాల్ జోషి ఒక ఫ్రేమ్ కోసం చాలా గ్లామ్



ఆకాంక్ష సింగ్ ఒక ఫ్యాషన్ ట్రెండ్ సెట్టర్ కూడా అయిన బహుముఖ నటి

# చరణ్, తారక్, ప్రభాస్ లా మహేష్ శ్రమించలేదా?



బాహుబలి సమయంలో ప్రభాస్, రానాలు సినిమా ప్రారంభానికి ముందు ఎలా సన్నధం అయ్యారో తెలిసిందే. ప్రభాస్ డ్యూయెల్ రోల్స్ పోషించాల్సి రావడంతో ఒక పాత్రకు బరువు పెరగడం..మరో పాత్రకు బరువు తగ్గడం జరిగింది. ప్రభాస్ బాడీలో ఈ మార్పు స్పష్టంగా కనిపించింది. అమరేంద్ర బాహుబలిలో కనిపిచండం కోసం భారీ దేహం... మహేంద్ర బాహుబలిలో కనిపించడం కోసం మరోలా శరీరంలో మార్పులు తీసుకురావాల్సి వచ్చింది. అందుకోసం ప్రభాస్ ఎంతో కష్టపడ్డాడు. ఒకకొన దశలో అనారోగ్యానికి గురయ్యాడు. భల్లాల దేవ పాత్ర కోసం రానా కూడా అంతే శ్రమించాల్సి వచ్చింది. భారీ దేహంతో కూడిన శరీరం కోసం తీసుకునే ఆహారంలో మార్పులు, కసరత్తులు చేసే సమయంలో మార్పులు ఇలా ఎన్నో చేయాల్సి వచ్చింది. ఆ తర్వాత %-%ఆర్ ఆర్ ఆర్%-% సినిమా కోసం రామ్ చరణ్, ఎన్టీఆర్ కూడా అంతే శ్రమిం చారు. బ్రిటీష్ పోలీస్ ఆఫీసర్ పాత్రలో చరణ్ భారీ దేహం...సిక్స్ ప్యాక్ లుక్ ఆ ట్రాన్స ఫర్మేషన్ చూసే స్టన్ అయ్యారంతా. ప్రభాస్ కష్టమంతా అందులో కనిపించింది. అలాగే ఎన్టీఆర్ కొమారం భీమ్ రోల్ కోసం అంతకు మించి శ్రమించాడు. బరువు మరింతగా తగ్గి సిక్స్ ప్యాక్ లంగోటా లుక్ చూడొచ్చు. అడవి బిడ్డగా తారక్ ఎంతో శ్రమించాడు.

రాజమౌళితో సినిమా అంటే హీరో ఇలా తయారవ్వాల్సి ఉంటుంది. మహేష్ రాజమౌళి సినిమా విషయం బయటకు వచ్చినప్పుడు ఎన్టీఆర్ చేస్తున్నావ్ గా? జక్కన్న తో! సినిమా అంటే ఎలా ఉంటుందోనని ఓ షోలో ఆటపట్టించాడు. మరి మహేష్ అలా రెడీ అయ్యాడా? మిల్క్ బోయ్ ని జక్కన్న అంతగా కష్టపెట్టాడా? అంటే అదెక్కడా కనిపించడం లేదు. లుక్ పరంగా మహేష్ బాడీలో ఎలాంటి కొత్త మార్పులు రాలేదు. %-%గుంటూరు కారం%-% టైమ్ లో ఉన్న వెయిట్ లోనే కొనసాగుతున్నారు. వచ్చిన మార్పు ఏదైనా ఉంది? అంటే అది కేవలం ఒక్క హెయిర్ స్టైల్లో మాత్రమే. అంతకు మించి ఒక్క ఛేంజ్ కూడా మహేష్ లో రాలేదు.

విదేశాల్లో...ఆఫ్రికన్ అడవుల్లో ట్రైనింగ్ తీసుకున్నాడని ప్రచారం జరిగింది. కానీ అలా ట్రైనింగ్ తీసు కుంటే శరీరంలో కొన్ని మార్పులు కనిపిస్తాయి. స్కిన్ టోన్ మారుతుంది. ముఖంలో మార్పులొస్తాయి. కానీ అవెక్కడా మహేష్ లో కనిపించలేదు. దీంతో రాజమౌళి మహేష్ని పెద్దగా కష్టపెట్టినట్లు ఎక్కడా కనిపిం చడం లేదనే టాపిక్ మొదలైంది. మేకోవర్ టార్గెట్ లేకుండానే మహేష్ బరిలోకి దిగడంటున్నారు.